RNI
TEL TEL / 2023/ 84132

# అక్షర సవాల్
సామాన్యుడు ప్రశ్నించే గొంతుక

ప్రచురణ-వరంగల్ రంగారెడ్డి ఎడిటర్: బాదావత్ బాలాజి సంపుటి :03 సంచిక :301 18 జనవరి 2026 ఆదివారం పేజీలు -8 వెల రూ 5-00

## ప్రజా సేవకు అంకితమైన అక్షర సవాల్..

**నూతన క్యాలెండర్ ఆవిష్కరణ**
**క్యాలెండర్ ఆవిష్కరణలో తహసీల్దార్,డిప్యూటీ తహసీల్దార్**



**నెక్కొండ, జనవరి 17 అక్షర సవాల్:** అక్షర సవాల్ దినపత్రిక 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను నెక్కొండ తహసీల్దార్ వేముల రాజ్‌కుమార్,డిప్యూటీ తహసీల్దార్ పల్లకొండ రవి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు సమాచారాన్ని వేగంగా,నిష్పక్షపాతంగా అందించడంలో అక్షర సవాల్ పాత్ర అభినందనీయమని అన్నారు. క్యాలెండర్ ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో ఉపయోగకరంగా ఉండాలని ఆకాంక్షించారు

రిపోర్టర్లు కావలెను
అక్షర సవాల్
తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.
తెలుగు రాష్ట్రాలలో సంచనాలు సృష్టిస్తున్న 'అక్షర సవాల్' మీకు సరైన వేదిక.. అన్ని జిల్లాల, మండలాల మరియు నియోజకవర్గాల పరిధిలో రిపోర్టర్లు కావాలి.
జిల్లాల వారిగా అనుభవజ్ఞులైన అడ్వర్టైజింగ్ మేనేజర్లు, ఆఫీసర్లు కావలెను
ఇంకెందుకు ఆలస్యం...
9347332442 నంబర్‌కు వాట్సాప్‌లో మీ బయోడేటాను పంపండి.

# మూసీ ప్రక్షాళనకు టీడీఆర్



**హైదరాబాద్, జనవరి 17:** హైదరాబాద్ పర్యావరణ పరిరక్షణలో ఒక కొత్త అధ్యాయానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నగరం చుట్టూ ఉన్న చెరువులు, కుంటలు, నాలాలు, నదుల పరిరక్షణే ధ్యేయంగా రేవంత్ రెడ్డి సర్కారు అత్యంత కీలకమైన నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు తీసుకొచ్చిన రూల్స్ వల్ల చెరువుల సంరక్షణతోపాటు ప్రతిష్టాత్మకంగా భావించే మూసీ నది అభివృద్ధి ప్రాజెక్టులో కదలిక రానుంది. టీడీఆర్‌లో మార్పులు చేర్పులు కేవలం ఆక్రమణ తొలగింపు మాత్రమే కాకుండా భూమిని కోల్పోయే పట్టాదారులకు ఊరట కల్పించేలా ఉన్నాయి. తెలంగాణ పురపాలక శాఖ విడుదల చేసిన జీవో నెంబర్ 16 ద్వారా భవన నిర్మాణ నిబంధనలు -2012లో కీలక సవరణలు చేసింది. సుప్రీంకోర్టు, ఎన్‌జీటీ ఆదేశాలతో జలాశయాల పరిరక్షణకు ఈ నిర్ణయం తీసుకుంది. చెరువుల ఎఫ్టీఎల్, నదుల ఎంఎఫ్ఎల్, బఫర్ జోన్‌లలో ఉన్న పట్టా భూములను స్వాధీనం చేసుకునే క్రమంలో భూ యజమానులకు భారీగా నగదు పరిహారానికి ప్రత్యామ్నాయంగా టీడీఆర్‌ను ఇవ్వబోతోంది. ఈ సవరణలు కేవలం నోటిఫైడ్ ప్రాజెక్టులకు, అంటే హైడ్రా, హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ వంటి సంస్థలు చేపట్టే పనులకు మాత్రమే వర్తిస్తాయి. ఇది తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని 300 డివిజన్ల వరకు అంటే ఔటర్ రింగ్ రోడ్డు వరకు అమలులోకి రానుంది. గతంలో ఉన్న టీడీఆర్ నిబంధనలను ప్రభుత్వం మరింత వెసులుబాటు కల్పించింది. స్వచ్ఛందంగా భూమిని అప్పగించే వారికి ప్రోత్సాహకాలు పెంచింది. ఇప్పుడు విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం పరిహారం మార్చింది. చెరువుల పూర్తి స్థాయి ఫీూ, వీఫీూ పరిధిలో ఉన్న భూములకు, ఆ యజమాని వదులుకున్న నిర్మిత విస్తీర్ణానికి ఏకంగా 200 శాతం టీడీఆర్ మంజూరు చేస్తారు. చెరువులు లేదా నదుల బఫర్ జోన్‌లలో ఉన్న భూములను అప్పగిస్తే 300 శాతం టీడీఆర్ లభిస్తుంది. జవనరుల అభివృద్ధి, రహదారి విస్తరణ లేదా బఫర్ జోన్ - మిగతా5లో

# అభాగ్యనగరం... వామ్మో... కాలుష్యం...



**హైదరాబాద్, జనవరి 17:**సంక్రాంతి పండు గకు సొంతూళ్లకు వెళ్లారు.. హైదరాబాద్ నగరం సగం ఖాళీ అయ్యింది.. రోడ్లపై ట్రా ఫిక్ తగ్గింది.. సిటీ బస్సులు, మెట్రో రైళ్లు సగం ఖాళీగానే కనిపిస్తున్నాయి. అస లే చలికాలం. వాహనాలు వదిలే పొగతో ముక్కులకు మాస్కులు ధరించి, బతుకుజీవుడా అంటూ ఇంటికి చేరే నగరవాసులకు ఈ నాలుగు రోజులు పండగే. పండుగ, పబ్బం లేనిరోజుల్లో అటు వాహనాల రద్దీ, ఇటు కాలుష్యంతో పొగచూరుతున్న నగ రం కూడా త్వరలోనే కాలుష్యంలో ఢిల్లీ స్థాయికి 'ఎదుగుతున్నదా' అనే ప్రశ్న అందరిని వెంటాడుతున్నది. ఢిల్లీలో రియల్ టైమ్ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) 400 దాటింది. 'ప్రమాదకర' విభాగంలోకి ప్రవేశించింది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) ప్రకారం ఢిల్లీలో ఏఐక్యూ 411గా న మోదైంది. -ఇది తీవ్రమైన ఆరోగ్య ప్రమాదాలను కలిగించే స్థాయి కావడం గమ నార్హం. హైదరాబాద్ ఇప్పటికీ ఆ తీవ్రస్థాయికి చేరలేదు గానీ, నగరంలో క్రమంగా దిగజారుతున్న గాలి నాణ్యతను నిర్లక్ష్యం చేయలేమని నిపుణులు - మిగతా5లో


## వ్యూహాత్మక మౌనమే పరిష్కారమా...!



**హైదరాబాద్, జనవరి 17:**ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తప్పులు జరగడం సహజం, ప్రజలు క్షమించడానికి సమయం పడుతుంది. తర్వాతి ఎన్నికల్లో ప్రజలే భవిష్యత్‌ను నిర్ణయిస్తారు. కానీ పదేళ్ల అధికారంతో తెలంగాణ చాంపియన్‌లుగా ప్రచారం చేసుకున్న బీఆర్ఎస్‌ను 2023 ఎన్నికల్లో ప్రజలు ఓడించారు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలో ఉంది. రెండేళ్ల పాలన పూర్తి చేసుకుంది. ప్రభుత్వంపై పెద్దగా వ్యతిరేకత లేదు. హామీలు అమలు చేయకపోయినా విపక్షాల నుంచి తప్ప ప్రజల నుంచి విమర్శలు రావడం లేదు. ఇక బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అయితే రేవంత్ సర్కార్‌ను నిత్యం టార్గెట్ చేస్తున్నారు. దీంతో విశ్లేషకులు నేతలకు ఓపిక ఉండాలని సూచిస్తున్నారుకేటీఆర్ ప్రతీ మాట సామాన్యుడి మనసులో కౌంటర్‌గా మారుతోంది. ఇది తన మాటల విలువను తగ్గిస్తూ, పార్టీకి నష్టం కలిగిస్తోంది. రేవంత్‌పై ఘాటు వ్యాఖ్యలు చేస్తూ కేటీఆర్ స్వయం పార్టీ బలోపేతానికి అడ్డంకిగా మారుతున్నారు. గత అధికార కాలంలోని తప్పులు గుర్తుంచుకోకుండా విమర్శిస్తుండడంతో ప్రజలు పెద్దగా కనెక్ట్ కావడం లేదు.తాజా పార్టీ మార్పులపై కేటీఆర్ వ్యాఖ్యలు గతాన్ని గుర్తు చేస్తున్నాయి. బీఆర్ఎస్ అధికారంలో - మిగతా5లో

# మేయర్,చైర్‌పర్సన్ పీఠాలకు రిజర్వేషన్లు ఖరారు

**మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో కీలక అప్‌డేట్**
**ఉమ్మడి జిల్లాలో 12 మున్సిపాలిటీలు**
**పాత 9 బల్దియాల్లో రొటేషన్ పద్ధతిన కోటా**
**కొత్తగా మూడు మున్సిపాలిటీల్లో మొదటిసారి ఎన్నికలు**
**కోటా ఖరారు కావడంతో ఆశావహుల ప్రదక్షిణలు షురూ**
**ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకునే పనిలో బిజీ బిజీ**
**అభ్యర్థుల ఎంపికలో ఆచితూచి వ్యవహరిస్తున్న ఎమ్మెల్యేలు**
**అర్థబలంతోపాటు క్యారెక్టర్, పలుకుబడికి ప్రాధాన్యం:**
**మున్సిపాలిటీల వారీగా చైర్‌పర్సన్ రిజర్వేషన్లు**






**స్టేషన్ ఘన్‌పూర్:** ఎస్సీ (జనరల్)
డోర్నకల్: ఎస్సీ (జనరల్)
మహబూబాబాద్: ఎస్టీ (జనరల్)
కేసముద్రం: ఎస్టీ (మహిళ)
నర్సంపేట: బీసీ (మహిళ)
ములుగు: బీసీ (మహిళ)
భూపాలపల్లి: బీసీ (జనరల్)
జనగామ: బీసీ (జనరల్)
మరిపెడ: మహిళ (జనరల్)
పరకాల: అన్‌రిజర్వ్‌డ్ (జనరల్)
వర్ధన్నపేట: అన్‌రిజర్వ్‌డ్ (జనరల్)
తొర్రూరు: అన్‌రిజర్వ్‌డ్ (జనరల్)
డబ్ల్యూఎంసీ మేయర్ పీఠం
గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్: అన్‌రిజర్వ్‌డ్ (జనరల్)

మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో మరో కీలక ముందడుగు పడింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 121 మున్సిపాలిటీల పరిధిలో చైర్‌పర్సన్ పీఠాలకు శనివారం రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు ప్రకటించింది. దీనిలో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 మున్సిపాలిటీ పీఠాలతోపాటు జీడబ్ల్యూఎంసీ మేయర్ పీఠాల రిజర్వేషన్లు - మిగతా5లో

# భూభారతిలోనూ... అవే లోపాలు




**హైదరాబాద్, జనవరి 17**:బీఆర్ఎస్ ప్రభుత్వ పతనానికి ఒక ప్రధాన కారణమైన ధరణి పోర్టల్‌లోని లోపాలను సరిదిద్ది, పారదర్శకమైన భూ రికార్డుల నిర్వహణ కోసం ప్రస్తుత ప్రభుత్వం భూభారతి ని ఎంతో ఆర్భాటంగా తీసుకువచ్చింది. అయితే, ఆచరణలో ఈ కొత్త వ్యవస్థ కూడా పాత రోగాలనే ప్రదర్శిస్తుండటం ఇప్పుడు రైతాంగాన్ని ఆందోళనకు గురి చేస్తోంది. ఇటీవల జనగామ, యాదాద్రి జిల్లాల్లో వెలుగుచూసిన చలాన్ల కుంభకోణం ఈ వ్యవస్థలోని సాంకేతిక లొసుగులను బట్టబయలు చేసింది. పేరు మార్చారు కానీ, అక్రమార్కులు చొరబడే మార్గాలను మాత్రం మూసివేయలేకపోయారనే విమర్శలు వినిపిస్తున్నాయి.భూభారతి వెబ్‌సైట్‌లో ఎడిట్ ఆప్షన్లను వాడుకుని నిందితులు ప్రభుత్వ ఖజానాకు కోట్లాది రూపాయల గండి కొడుతున్నారు. కేవలం సాఫ్ట్‌వేర్ కోడింగ్‌లో ఉన్న లోపాల వల్ల అక్రమార్కులు చలాన్ల విలువను మార్చి, ప్రభుత్వానికి తక్కువ డబ్బు చెల్లిస్తూ రిజిస్ట్రేషన్లు పూర్తి చేస్తున్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుని వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సింది పోయి, సమస్య బయటపడినప్పుడు మాత్రమే స్పందిస్తూ అండర్ ప్లే చేస్తోందనే ఆరోపణలు వస్తున్నాయి. లోపాలను ఆదిలోనే గుర్తించి అరికట్టడంలో ఐటీ విభాగం వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది.క్షేత్రస్థాయిలో రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. భూముల మార్పిడి, వారసత్వ సంక్రమణ, పట్టాదారు పాస్ పుస్తకాల్లో తప్పుల సవరణ వంటి అంశాల్లో భూభారతి ఇంకా వేగం పుంజుకోలేదు. స్లాట్ బుకింగ్ దొరకకపోవడం, - మిగతా5లో

# నేడు మేడారంలో తెలంగాణ కేబినెట్ భేటీ

**మేడారం ప్రత్యేక ప్రతినిధి, అక్షర సవాల్** :ఆదివారం (జనవరి 18) వనదేవతల సన్నిధి మేడారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరగనుంది. సాయంత్రం 5 గంటలకు హరిత హోటల్‌లో ఈ భేటీ నిర్వహించనున్నట్లు అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇందుకోసం ఆయా శాఖల సెక్రటరీలు, ఉన్నతాధికారులు మేడారానికి చేరుకుంటున్నారు. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో హైదరాబాద్ నగరం బయట కేబినెట్ సమావేశం జరగడం ఇదే తొలిసారి. ఏర్పాట్లను మంత్రి సీతక్క పర్యవేక్షిస్తున్నారు. సీఎం, మంత్రులు, అధికారులు కలిపి సుమారు 300 మంది బసకు ఏర్పాట్లు చేశారు. జనవరి 28 నుంచి సమ్మక్క,సారలమ్మ జాతర నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. కేబినెట్‌లో రైతు భరోసా, హ్యామ్ రోడ్ల నిర్మాణం, మున్సిపల్ ఎన్నికలు తదితర కీలక అంశాలపై చర్చ జరిగే అవకాశం ఉంది. భద్రతను కట్టుదిట్టం చేశారు.



# సంపాదకీయం

## ఇకనైనా బిసిల ప్రాతినిధ్యం పెరిగేనా?

పట్టణ రాజకీయాల్లో కీలక మలుపుగా నిలిచే మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ మరో నిర్ణాయక దశను దాటింది. ఓటరు జాబితా తుదిరూపు దాల్చిన తర్వాత తాజాగా మున్సిపల్ శాఖ రిజర్వేషన్లను పూర్తిగా ఖరారు చేయడంతో రాష్ట్రవ్యాప్తంగా పట్టణ స్థానిక సంస్థలు ఎన్నికల వాతావరణంలోకి ప్రవేశించాయి. రాష్ట్రంలో ఉన్న 131 పట్టణ స్థానిక సంస్థలు? 10 మున్సిపల్ కార్పొరేషన్లు, 121 మున్సిపాలిటీలు?అన్నింటికీ మేయర్, చైర్పర్సన్, కార్పొరేటర్, కౌన్సిలర్ స్థాయిల్లో రిజర్వేషన్లు ఖరారయ్యాయి. ఈ నిర్ణయాలు కేవలం ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పరిపాలనా ప్రక్రియగానే కాకుండా, రాబోయే రాజకీయ సమీకరణలకు దిశానిర్దేశం చేసే అంశంగా మారాయి. ముఖ్యంగా బీసీలకు 31 శాతం రిజర్వేషన్ అమలు, మహిళలకు పెద్ద ఎత్తున చైర్పర్సన్, మేయర్ స్థానాల కేటాయింపు, 'డెడికేటెడ్ కమిషన్' నివేదిక ఆధారంగా సంఖ్యల నిర్ణయం?ఈ మూడు అంశాలు ఈ ఎన్నికలను అత్యంత ప్రాధాన్యత కలిగినవిగా మార్చాయి. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో గత అనుభవాలను పరిశీలిస్తే, రిజర్వేషన్ల అంశమే అత్యంత వివాదాస్పదంగా మారిన సందర్భాలు అనేకం. ముఖ్యంగా బీసీ రిజర్వేషన్లపై న్యాయస్థానాల జోక్యం కారణంగా గతంలో ఎన్నికలు వాయిదా పడిన పరిస్థితులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈసారి ప్రభుత్వం ప్రత్యేకంగా 'డెడికేటెడ్ కమిషన్'ను ఏర్పాటు చేసి, జనాభా గణాంకాలు, సామాజిక?ఆర్థిక పరిస్థితులు, పట్టణ ప్రాంతాల్లో వర్గాల ప్రాతినిధ్యం వంటి అంశాలను శాస్త్రీయంగా అధ్యయనం చేయించింది. ఆ నివేదిక ఆధారంగా బీసీలకు 31 శాతం రిజర్వేషన్ ఖరారు చేయడం ద్వారా ప్రభుత్వం ఒకవైపు సామాజిక న్యాయాన్ని ప్రతిపాదిస్తూనే, మరోవైపు న్యాయపరమైన అడ్డంకులకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నట్టు స్పష్టమవుతోంది. పట్టణ ప్రాంతాల్లో బీసీల జనాభా గణనీయంగా ఉన్నప్పటికీ, రాజకీయ ప్రాతినిధ్యం తక్కువగా ఉందన్న విమర్శలు చాలా కాలంగా ఉన్నాయి. ఈ నిర్ణయం ఆ అసమతుల్యతను సరిచేసే దిశగా కీలక అడుగుగా భావించబడుతోంది. మహిళలకు ఇచ్చిన ప్రాధాన్యత కూడా ఈ ఎన్నికల ప్రత్యేకతగా నిలుస్తోంది. మొత్తం మున్సిపాలిటీల్లో 60 చైర్పర్సన్ స్థానాలు, కార్పొరేషన్లలో 5 మేయర్ స్థానాలు మహిళలకు కేటాయించ బడటం పట్టణ పాలనలో మహిళా నాయకత్వాన్ని బలోపేతం చేసే ప్రయత్నంగా చూడాలి. ఇప్పటికే గ్రామీణ స్థాయిలో పంచాయతీ రాజ్ వ్యవస్థలో మహిళా రిజర్వేషన్లు విస్తృత ప్రభావం చూపిన నేపథ్యం ఉంది. అదే తరహాలో పట్టణ ప్రాంతాల్లోనూ మహిళా ప్రాతినిధ్యం పెరగడం వల్ల పాలనలో కొత్త దృక్పథం, ప్రజా సంబంధాలపై ఎక్కువ శ్రద్ధ, సామాజిక సమస్యల పట్ల సున్నితత్వం పెరుగుతుందన్న అంచనాలు ఉన్నాయి. అయితే, మరోవైపు కుటుంబ రాజకీయాలు, ప్రత్యక్షంగా కాకుండా పరోక్షంగా అధికారాన్ని వినియోగించే పరిస్థితులు కొనసాగు తాయన్న విమర్శలూ వినిపిస్తున్నాయి. అయినప్పటికీ, దీర్ఘకాలికంగా చూస్తే మహిళల రాజకీయ భాగస్వామ్యం పెరగడం ప్రజాస్వామ్యానికి మేలు చేస్తుందన్న వాదనకు ఈ నిర్ణయాలు బలాన్ని చేకూరుస్తున్నాయి. జీహెచ్ఎంసీ సహా అన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు రిజర్వేషన్లు ఫైనల్ కావడం వల్ల ఇప్పుడు రాజకీయ దృష్టి పూర్తిగా అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహాలపైకి మళ్లింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు ఎప్పుడూ రాష్ట్ర రాజకీయాలకు దిక్సూచిగా భావించ బడతాయి. హైదరాబాద్ నగరం రాష్ట్ర ఆర్థిక, రాజకీయ, సామాజిక కేంద్రంగా ఉండటం వల్ల ఇక్కడి ఫలితాలు మిగతా ప్రాంతాలపై ప్రభావం చూపుతాయి. గత ఎన్నికల్లో జీహెచ్ఎంసీ ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో పెద్ద చర్చకు దారితీశాయి. ఈసారి కూడా అదే స్థాయిలో ఆసక్తి నెలకొంది. గ్రేటర్ వరంగల్, ఖమ్మం, సిద్దిపేట వంటి కార్పొరేషన్లలోనూ పట్టణ మధ్యతరగతి, ఉద్యోగ వర్గాలు, యువత ఓటింగ్ తీరు కీలకంగా మారనుంది. ప్రభుత్వం ఆరు గెజిట్ నోటిఫికేషన్లు విడుదల చేసి రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించడం ద్వారా ఎన్నికల నిర్వహణపై తన సంకల్పాన్ని స్పష్టంగా చాటింది. వార్డుల వారీగా రిజర్వేషన్ల వివరాలు కలెక్టర్లకు, మున్సిపల్ అధికారులకు పంపించడంతో క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు వేగవంత మయ్యాయి. కేబినెట్ భేటీ అనంతరం ఎవరికీ ఏ స్థానం అన్న స్పష్టత రావడంతో ఆశావహుల్లో కదలిక మొదలైంది. ఒకే పార్టీ టికెట్ కోసం పలువురు పోటీ పడుతున్న పరిస్థితి అనేక చోట్ల కనిపిస్తోంది. ముఖ్యంగా బీసీ, మహిళా రిజర్వేషన్ వచ్చిన స్థానాల్లో పోటీ తీవ్రంగా మారే సూచనలు ఉన్నాయి. ఇది పార్టీలకు అంతర్గత అసంతృప్తులను ఎదుర్కొనే పరిస్థితిని కూడా తెచ్చిపెట్టవచ్చు. ప్రభుత్వ వ్యూహాన్ని గమనిస్తే, ఈ ఎన్నికలను ఒక రకంగా ప్రజాభిప్రాయ సేకరణగా మలచు కోవాలన్న ఆలోచన స్పష్టంగా కనిపిస్తోంది. పట్టణ అభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలను ప్రధానంగా ప్రచారంలోకి తెచ్చే ప్రయత్నం జరుగుతోంది. బీసీ రిజర్వేషన్ ద్వారా సామాజిక న్యాయాన్ని, మహిళా రిజర్వేషన్ల ద్వారా ప్రగతిశీల పాలనను ప్రతిబింబించేలా ప్రభుత్వం తన వాదనను నిర్మిస్తోంది. పట్టణ ప్రాంతాల్లో అమలు చేసిన అభివృద్ధి పనులు, రహదారులు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, పారిశుధ్య కార్యక్రమాలు ఓటర్లను ఎంతవరకు ఆకర్షిస్తాయన్నది ఫలితాల్లో తేలనుంది. మరోవైపు ప్రతిపక్షాలు ఈ ఎన్నికలను ప్రభుత్వంపై అసంతృప్తిని వ్యక్తం చేసే అవకాశంగా చూస్తున్నాయి. పట్టణాల్లో పెరిగిన జీవన వ్యయం, ఇంధన ధరలు, ఆస్తి పన్నులు, ట్రాఫిక్ సమస్యలు, నిరుద్యోగం వంటి అంశాలను ప్రతిపక్షాలు ప్రధాన అస్త్రాలుగా చేసుకోవాలని భావిస్తున్నాయి. రిజర్వేషన్ల ప్రక్రియలో కొన్ని చోట్ల అసమతుల్యత ఉందన్న ఆరోపణలు, వార్డు పునర్విభజనలో రాజకీయ లాభనష్టాల కోణం ఉందన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా మధ్యతరగతి ఓటర్లు అభివృద్ధి, పారదర్శకత, స్థానిక సమస్యల పరిష్కారాన్ని ప్రాధాన్యంగా చూస్తారని ప్రతిపక్షాలు అంచనా వేస్తున్నాయి. గణాంకాల పరంగా చూస్తే, 121 మున్సిపాలిటీల్లో బీసీలకు 31 శాతం రిజర్వేషన్ అమలవడం వల్ల వేలాది మంది కొత్త నాయకులు రాజకీయ రంగ ప్రవేశం చేసే అవకాశం ఏర్పడింది. ఎస్సీ, ఎస్టీ, మహిళా రిజర్వేషన్లతో కలిపి మొత్తం పట్టణ స్థానిక సంస్థల పాలనలో విస్తృత సామాజిక ప్రాతినిధ్యం కనిపించనుంది. ఇది స్థానిక సమస్యల పరిష్కారంలో విభిన్న వర్గాల స్వరాలు వినిపించే అవకాశాన్ని పెంచుతుంది. అయితే, అదే సమయంలో అనుభవం లేని నాయకత్వం వల్ల పరిపాలనా సామర్థ్యం తగ్గుతుందన్న ఆందోళనలూ వ్యక్తమవుతున్నాయి. దీనికి సమాధానం ఎన్నికల అనంతరం పాలనలోనే తేలనుంది. వచ్చే నెల రెండో వారంలోపే ఎన్నికలు పూర్తి చేయాలన్న లక్ష్యంతో షెడ్యూల్ ఖరారు కావడంతో ప్రచారం మరింత ఉధృతం కానుంది. తక్కువ సమయంలో ఓటర్లను చేరుకోవడానికి పార్టీలన్నీ సామాజిక మాధ్యమాలు, డిజిటల్ ప్రచారం, వార్డు స్థాయి సమావేశాలపై ఎక్కువగా ఆధారపడ నున్నాయి. యువత ఓటింగ్ శాతం పెరిగే అవకాశముండటంతో వారి సమస్యలు, ఆశలు కూడా ప్రచారంలో ప్రధాన అంశాలుగా మారతాయి. పట్టణ ఓటర్లు కేవలం పార్టీ అనుబంధంతో కాకుండా, అభ్యర్థి వ్యక్తిత్వం, స్థానిక సమస్యలపై అవగాహన, అందుబాటులో ఉండే స్వభావం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకునే పరిస్థితి పెరుగుతోంది. మొత్తంగా మున్సిపల్ ఎన్నికల్లో రిజర్వేషన్ల ఖరారు రాష్ట్ర రాజకీయాల్లో ఒక కీలక మైలురాయిగా నిలిచింది. ఇది సామాజిక న్యాయం, మహిళా సాధికారత, పట్టణ పాలనలో సమగ్రత అనే మూడు మూల స్తంభాలపై ఆధారపడి ముందుకు సాగుతున్న ప్రక్రియగా చూడాలి. ఈ ఎన్నికల ఫలితాలు కేవలం మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పాలనకే పరిమితం కాకుండా, రాబోయే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలపై కూడా ప్రభావం చూపే సూచనలు ఉన్నాయి. పట్టణ ఓటర్లు ఇచ్చే తీర్పు రాష్ట్ర రాజకీయ దిశను ఎంతవరకు మార్చగలదన్నది త్వరలో తేలనుంది. ప్రజాస్వామ్యంలో స్థానిక సంస్థలే పునాది అన్న భావనను మరోసారి గుర్తుచేస్తూ, ఈ మున్సిపల్ ఎన్నికలు ఒక కీలక అధ్యాయంగా చరిత్రలో నమోదు కానున్నాయి.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు మరింత వేగవంతం చేయండి..

**హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

**ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిపై గృహ నిర్మాణ, ఎంపీడీవోలు, మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం**

**హనుమకొండ, జనవరి 17 అక్షర సవాల్:** జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు మరింత వేగవంతం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా అదనపు కలెక్టర్ రవి తో కలిసి హనుమకొండ జిల్లా పరిధిలోని మండలాలు, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్, పరకాల మున్సిపల్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిపై గృహ నిర్మాణశాఖ, ఎంపీడీవోలు, మున్సిపల్ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా మండలాలు, మున్సిపల్ పరిధిలో ఎన్ని ఇండ్లు తుది దశకు వచ్చాయి, మిగతావి ఎన్ని ఏయే దశల్లో ఉన్నాయి, మార్కౌట్ కానివి ఎప్పుడు ప్రారంభిస్తారు, ఎస్బీఎం, వీబీ-జీ రామ్ జీ (ఉపాధి హామీ) పథకం గురించిన అంశాలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.



ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పూర్తయిన వాటికి బిల్లులను చెల్లింపు చేయాలన్నారు. ప్రతి వారంలో పనుల పురోగతి ముప్పై శాతం ఉండాలన్నారు. మార్కౌట్ చేయనివి వెంటనే చేయాలన్నారు. మంజూరై పనులు మొదలు కానివి ఈ నెల 31వ తేదీలోగా అన్ని ప్రారంభం కావాలని, ఇంకా గడువు పొడగింపు లేదని, పనులు మొదలు పెట్టకుంటే రద్దు చేయాలన్నారు. ఎల్ 3 జాబితాలో అర్హులైన వారు ఉన్నట్లయితే పరిశీలించాలన్నారు. మొంథా తుపాన్ కారణంగా ఇండ్లు పూర్తిగా, పాక్షికంగా దెబ్బతిన్న వారికి ఇండ్లు కేటాయింపు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఇందిరమ్మ ఇండ్లు, రెండుపడక గదుల ఇళ్ళు, బిల్లుల గురించి గృహ నిర్మాణ శాఖ పీడీ సిద్దార్థ నాయక్, ఎస్బీఎం, వీబీ- జీ రామ్ జీ పనుల గురించి డీఆర్డీఏ మేన శ్రీను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ డిఈ రవీందర్, కాజీపేట డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్,పరకాల మున్సిపల్ కమిషనర్ అంజయ్య, ఎంపీడీవోలు, ఏఈలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను ప్రతిబింబిస్తూ ముందుకు సాగాలి: ఎస్సై ఎం.మహేందర్

**అక్షర సవాల్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ**

**నెక్కొండ, జనవరి 17 అక్షర సవాల్:** అక్షర సవాల్ దినపత్రిక 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను నెక్కొండ పోలీస్ స్టేషన్ ఎస్సై ఎం. మహేందర్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిజమైన సమాచారం అందించడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తోందని,అక్షర సవాల్ దినపత్రిక ప్రజా సమస్యలను ప్రతిబింబిస్తూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. సమాజంలో చైతన్యం పెంపొందించడంలో పత్రికల పాత్ర అనిర్వచనీయమని పేర్కొంటూ,నూతన సంవత్సరంలో అక్షర సవాల్ మరిన్ని విజయాలు సాధించాలని శుభాకాంక్షలు తెలిపారు.




## 19న క్రీడాకారుల ఎంపిక ...

**- మండల విద్యాశాఖ అధికారిని పొదెం మేనక**

**మంగపేట, జనవరి17, అక్షర సవాల్:**సీఎం కప్ 2025- 26 అథ్లెటిక్స్ విభాగంలో మంగపేట క్లస్టర్ పరిధిలో నిర్వహించనున్న ఆటలు (కబడ్డీ ఖోఖో వాలీబాల్ ) పోటీలలో పాల్గొనుటకు నమోదు చేసుకున్న అభ్యర్థులు (క్రీడాకారులు ) సోమవారం ఉదయం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మంగపేట ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో క్రీడాకారుల ఎంపికను నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారిని పొదెం మేనక పత్రికా ప్రకటనలో తెలిపారు అదేవిధంగా నమోదు చేసుకున్న అభ్యర్థులు విధిగా హాజరు కవాలని కోరారు.

# మేయర్,చైర్‌పర్సన్ పీఠాలకు రిజర్వేషన్లు ఖరారు

**ఖరారయ్యాయి. ఈ 12 మున్సిపాలిటీల్లో 9 పాత మున్సిపాలిటీలు కాగా, స్టేషన్ ఘన్‌పూర్, ములుగు, కేసముద్రం కొత్త మున్సిపాలిటీలు. పాత 9 మున్సిపాలిటీలకు రొటేషన్ పద్ధతిలో రేజర్వేషన్ల కేటాయింపు జరిగింది. కోటా ఖరారు కావడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి.**

**అక్షర సవాల్? , వరంగల్? ప్రతినిధి :** చైర్‌పర్సన్‌కు కోటా కేటాయింపుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు కేటాయింపుల్లో ప్రాధాన్యం లభించింది. ఎస్టీ, ఎస్సీ రిజర్వేషన్లను ముందుగా ఖరారు చేశామని, లాటరీ ద్వారా 50శాతం మహిళలకు కోటా కల్పించామని మున్సిపల్‌శాఖ డైరెక్టర్ శ్రీదేవి స్పష్టం చేశారు. పాత మున్సిపాలిటీల్లో రొటేషన్ పద్ధతిన కోటా కోటాయించామని స్పష్టం చేశారు. మొత్తంగా ఎస్టీలకు 5, ఎస్సీలకు 15, బీసీలకు 38, బీసీ మహిళలకు 19 చైర్‌పర్సన్ పీఠాలను ఖరారు చేశామని వివరించారు. మిగతా చోట్ల జనరల్‌కు కేటాయించామని వివరించారు. అలాగే పది నగరపాలక సంస్థల(కార్పొరేషన్లు) పరిధిలోని మేయర్ పీఠాలకు ఎస్సీలకు ఒకటి, ఎస్టీలకు ఒకటి, బీసీ మహిళలకు మూడు చొప్పున కేటాయించామని తెలిపారు. మరో 5 మేయర్ పీఠాలను జనరల్ కేటగిరీకి కేటాయించామని వెల్లడించారు. ఉమ్మడి వరంగ్ జిల్లాలోని 12 మున్సిపాలిటీల్లోని చైర్‌పర్సన్ పీఠాలకు రిజర్వేషన్ల కేటాయింపు ఇలా ఉంది. స్టేషన్ ఘన్‌పూర్ చైర్‌పర్సన్ పీఠం ఎస్సీ (జనరల్)కు, నర్సంపేట బీసీ (మహిళ), జనగామ: బీసీ (జనరల్), భూపాలపల్లి: బీసీ (జనరల్), మహబూబాబాద్: ఎస్టీ (జనరల్), డోర్నకల్: ఎస్సీ (జనరల్), కేసముద్రం: ఎస్టీ (మహిళ), ములుగు: బీసీ (మహిళ), పరకాల: జనరల్, మరిపెడ: మహిళ (జనరల్), వర్ధన్నపేట: జనరల్‌కు, తొర్రూరు: జనరల్‌కు కేటాయింపు జరిగింది.

**ఆశావహుల ప్రదక్షిణలు**

వార్డులతోపాటు చైర్‌పర్సన్ పీఠాలకు రిజర్వేషన్లు ఖరారు కావడంతో ఆశావహులు ఇక రంగంలోకి దిగారు. తమకంటే తమకు సీటు కేటాయించాలని పట్టుబడుతున్నారు. ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ వారిని ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. మరోవైపు ఎమ్మెల్యేలు అభ్యర్థుల ఎంపికలో ఆచూతూచి వ్యవహరిస్తున్నారు. అర్థ బలంతోపాటు జనాల్లో ఆశావహులకు ఉన్న పలుకుబడిని, వారి నడవడికను పరిశీలిస్తున్నారు. కేవలం ఖర్చు పెట్టే అభ్యర్థి మాత్రమే కాకుండా.. ప్రజల్లో మంచి పేరు ఉన్న నేతలను ఎంపిక చేయాలని కసరత్తు చేస్తున్నారు.

**ఎమ్మెల్యేలకు సవాల్..**

ఉమ్మడి జిల్లాలో మొత్తం 12 నియోజకవర్గాలు ఉండగా, వాటిలో 10 నియోజకవర్గాల్లో ఈ 12 మున్సిపాలిటీలు ఉన్నాయి. అంటే.. జీడబ్ల్యూఎంసీ తప్ప.. దాదాపు ప్రతి నియోజకవర్గంలో మున్సిపల్ ఎన్నికలు జరుగుతున్నట్లు లెక్క. అలాగే.. మొత్తం 10 నియోజకవర్గాల్లోని ఒక్క జనగాం మున్సిపాలిటీ తప్ప.. మిగిలిన్న అన్ని చోట్ల ఎమ్మెల్యేలు అధికార పార్టీకి చెందిన వారే. ఆ ఎమ్మెల్యేలు ఆయా మున్సిపల్ పీఠాలు దక్కించుకునేందుకు సర్వశక్తులొడ్డనున్నారు. పంచాయతీ ఎన్నికల్లో కొందరు ఎమ్మెల్యేల పనితీరు బాగాలేదని సీఎం రేవంత్‌రెడ్డి గతంలో టెలీ కాన్ఫరెన్స్ మరీ మందలించిన నేపథ్యంలో.. ఆ ఎమ్మెల్యేలు ఇప్పుడు రంగంలోకి దిగనున్నారు. తమ పార్టీకి చెందిన అభ్యర్థులను గెలిపించుకునేందుకు వ్యూహ ప్రతివ్యూహాలు రచించనున్నారు.

**జనరల్ స్థానాల్లో పోటీ ఎక్కువ**

ముఖ్యంగా జనరల్ లేదా అన్‌రిజర్వ్‌డ్ కేటగిరీ కిందకు వచ్చిన స్థానాల్లో రాజకీయపరంగా పోటీ భారీగా ఉండే అవకాశం ఉంది. ఎందుకంటే ఆయా స్థానాల్లో కుల, మతాలకు అతీతంగా ఏ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులైనా పోటీ పడేందుకు అవకాశాలు ఉన్నాయి. పరకాల, తొర్రూరు వంటి మున్సిపాలిటీల్లో కూడా రిజర్వేషన్లు లేకపోవడంతో బలమైన ఆర్థిక, సామాజిక నేపథ్యం ఉన్న అభ్యర్థుల మధ్య గట్టిపోటీ నెలకొనే అవకాశం ఉంది. అన్‌రిజర్వ్‌డ్ స్థానాల్లో పోటీ బలంగా ఉండటం అన్ని పార్టీలకు పెద్ద సవాల్. ఆయా స్థానాల్లో ఎన్నికల ప్రచారం భారీగా ఉండనుంది. మునుపెన్నడూ లేనంతగా అభ్యర్థులు ఎన్నికలకు ఖర్చు పెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**డబ్ల్యూఎంసీ మేయర్ పీఠం జనరల్‌కు..**

అత్యంత ప్రతిష్టాత్మకమైన గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (డబ్ల్యూఎంసీ) మేయర్ పీఠం రిజర్వేషన్ జనరల్ అయింది. ఇక్కడ ప్రస్తుతం ఎన్నికలు జరుగకపోయినా, ఎప్పుడు.. ఎన్నిక జరిగినా మేయర్ పీఠాన్ని దక్కించుకునేందుకు అన్ని ప్రధాన పార్టీలు విశ్వ ప్రయత్నాలు చేస్తాయి. అందుకే.. మేయర్ అభ్యర్థిని ఎంచుకోవడంలో ఆచూతూచి వ్యవహరిస్తానడంలో సందేహం లేదు. సదరు అభ్యర్థికి జనాల్లో పలుకుబడితో పాటు ఆర్థిక బలాన్నీ పరిగణలోకి తీసుకుంటాయి.

## త్వరలో మున్సిపల్ ఎన్నికలు..

# కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాల్సిందే

**రాంచందర్ రావు**



**హైదరాబాద్, జనవరి 17:** రాష్ట్రంలో త్వరలో మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుందని.. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా తాము సిద్ధంగా ఉన్నామని తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు పేర్కొన్నారు. శనివారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలు చేసిన కృషిని ఆయన అభినందించారు. దాదాపు 5 వేల సర్పంచ్ స్థానాలకు పోటీ చేశామని.. గతంలో కంటే బీజేపీ సర్పంచ్‌ల సంఖ్య పెరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీ బలోపేతమైందని.. ఇందుకు ఈ ఫలితాలే నిదర్శనమని చెప్పారు.

**బీఆర్ఎస్ ముక్కలవడం ఖాయం..**

బీఆర్ఎస్ పార్టీ త్వరలో ముక్కలవుతుందని, ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని తెలంగాణ బీజేపీ చీఫ్ ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లడం, సభలు నిర్వహించడం తప్ప ఏమీ చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 40 శాతం కమిషన్‌గా మారిపోయిందని, పారిశ్రామికవేత్తలను బెదిరిస్తుందని ఆరోపణలు చేశారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు పెద్దఎత్తున నిధులు అందిస్తోందని.. వాటితోనే అభివృద్ధి జరుగుతోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రాజెక్టులకు, విద్యాలయాలకు భూమి కేటాయించడం లేదని ఆయన విమర్శించారు.

**అబద్ధాలు ప్రచారం..**

కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు ఏమీ చేయలేదని రాంచందర్ రావు విమర్శించారు. గ్రామాల్లో అభివృద్ధికి ముఖ్యమంత్రి ఢిల్లీ వెళ్లాల్సిన - మిగతా5లో

## కోర్టు పర్మిషన్‌తో బ్రహ్మాండంగా
# మళ్లీ ర్యాలీ నిర్వహిస్తాం: కేటీఆర్

ఈ రెండేళ్ల పాలనలో సీఎం రేవంత్ రెడ్డి పేర్లు మార్చడం తప్ప చేసిందేమీ లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. టీఎస్‌ను టీజీగా మార్చారని తెలిపారు. దానివల్ల ఎవరికి లాభం జరిగిందని ప్రశ్నించారు. తెలంగాణ తల్లి రూపాన్ని మార్చి.. కాంగ్రెస్ తల్లిని తీసుకొచ్చారని మండిపడ్డారు. తెలంగాణ రాజముద్ర నుంచి చార్మినార్‌ను తీసేస్తానని అంటున్నాడని తెలిపారు. ఇప్పటికే కాకతీయ కళాతోరణాన్ని తీసేశారని పేర్కొన్నారు. దిక్కుమాలిన తుగ్లక్ పనులు తప్ప.. రాష్ట్రానికి చేసింది శూన్యమని విమర్శించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. మీకు అధికారం ఇచ్చింది ప్రజల హక్కులు కాపాడటానికి అని రేవంత్ సర్కార్‌కు సూచించారు. కానీ మీరు చేస్తున్నదేంటి అని ప్రశ్నించారు. రెండేళ్లలో హైదరాబాద్‌లో ఒక్క కొత్త రోడ్డు వేశావా అని రేవంత్ రెడ్డిని నిలదీశారు. ఒక్క ఫ్లై ఓవర్ కట్టావా? అని ప్రశ్నించారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని అన్నారు. కాంగ్రెస్ నాయకులు చరిత్రహీనులుగా మిగిలిపోతారని విమర్శించారు. సికింద్రాబాద్ అస్తిత్వాన్ని దెబ్బతీసిన పార్టీగా కాంగ్రెస్ మిగిలిపోతుందని కేటీఆర్ అన్నారు. రేవంత్ రెడ్డి సికింద్రాబాద్ ఐడెంటిటీని తొలగించాలని చూస్తున్నాడని మండిపడ్డారు. అందుకే అన్ని వర్గాల ప్రజలు ఒక్కటై ర్యాలీకి సిద్ధమయ్యారని తెలిపారు. పార్టీలకు అతీతంగా శాంతియుత ర్యాలీకి పిలుపునిచ్చారని అన్నారు. శాంతి ర్యాలీకి బీఆర్ఎస్ పార్టీని కూడా ఆహ్వానించారని తెలిపారు. మా ప్రజాప్రతినిధులమంతా సంఘీభావం తెలుపుదామని సిద్ధమయ్యామని పేర్కొన్నారు. కానీ వేలాది మందిని ఎక్కడికక్కడ అరెస్టులు చేశారని తెలిపారు. తమను కూడా తెలంగాణ భవన్‌లో నిర్బంధించారని చెప్పారు. అరెస్టులు చేసి పైశాచిక



ఆనందం పొందుతున్నారని కేటీఆర్ విమర్శించారు. కోర్టుకు వెళ్లి న్యాయం కోసం పోరాడుతామని తెలిపారు. కోర్టు పర్మిషన్‌తో బ్రహ్మాండంగా మళ్లీ ర్యాలీ నిర్వహిస్తామని స్పష్టం చేశారు. సికింద్రాబాద్ బిడ్డల మనోభావాలను బీఆర్ఎస్ పార్టీ గౌరవిస్తుందని తెలిపారు. అరెస్టు చేసిన వారిని భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పరిపాలన వికేంద్రీకరణ కోసం కేసీఆర్ కొత్త జిల్లాలు ఏర్పాటు చేశారని తెలిపారు. కొత్త మండలాలు, రెవెన్యూ డివిజన్లు తీసుకొచ్చారని పేర్కొన్నారు. తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చారని అన్నారు. హైదరాబాద్‌లో నాలుగు జోన్లు ఉంటే.. ఆరు జోన్లు చేసుకున్నామని అన్నారు. ఇన్ని చేసినా హైదరాబాద్ అస్తిత్వాన్ని బీఆర్ఎస్ ఏనాడూ టచ్ చేయలేదని స్పష్టం చేశారు. ఉన్న జిల్లాలను తీసేయడానికి రేవంత్ రెడ్డి కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. కొత్త కలెక్టరేట్లు అద్భుమని మీ మంత్రి కోమటిరెడ్డి అన్నాడని గుర్తుచేశారు. చేతనైతే సికింద్రాబాద్‌ను డెవలప్ చెయ్.. అంతేతప్ప ఫోర్త్ సిటీ పేరుతో తుగ్లక్ పనులు చేయకు అని రేవంత్ రెడ్డికి సూచించారు.

## సూర్యాపేట జిల్లాలో రోడ్డు ప్రమాదం..

**ప్రభుత్వ ఉపాధ్యాయురాలు మృతి**



**సూర్యాపేట:**జాజిరెడ్డిగూడెం (మం) అర్వపల్లి వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. కారు అదుపు తప్పి రోడ్డు పక్కన పల్టీలు కొట్టింది. రోడ్డు ప్రమాదంలో తుంగతుర్తి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ఎస్ఓ కల్పన దుర్మరణం పాలయ్యారు. పాఠశాలలు పునఃప్రారంభం అయినందున నల్గొండ నుండి కారులో పాఠశాలలకు ఉపాధ్యాయులు వెళ్తున్నారు. మొత్తం ఐదుగురు ఉపాధ్యాయుల్లో ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులు వున్నారు. ఘటనలో మరో ఇద్దరు ప్రధానోపాధ్యాయులకు తీవ్ర గాయాలు అయ్యాయి. వారిని 108 అంబులెన్సులో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

### విషాదాంతమయిన బాలుడి ఆదృశ్యం

**నిర్మల్:**నిర్మల్ జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్ వీధిలో వారం రోజుల క్రితం ఇంటిముందు ఆడుకుంటూ అదృశ్యమైన మూడు సంవత్సరాల బాలుడు చందు ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు, పోలీసులు విస్తృత గాలించారు. ఫలితం లేకుండా పోయింది. శనివారం ఉదయం ఇంటి ముందు గల కందకంలో బాలుడు శవమై తేలాడు. బాలుడి మృతదేహాన్ని చూసిన కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. బాలుడి శవాన్ని జిల్లా కేంద్ర ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

## మంథని మున్సిపాలిటీపై
# ఎగరనున్న బీసీల జెండా

**-మంథని మున్సిపల్ పీఠం బీసీ జనరల్ కు కేటాయింపు**

**-13 వార్డులకు వార్డుల వారీగా రిజర్వేషన్లు ఖరారు**




**మంథని:**మంథని మున్సిపల్ చైర్మన్ పదవి బీసీ జనరల్ కు కేటాయిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మంథని మున్సిపాలిటీ పై బీసీల జెండా ఎగరనుంది. ఈసారి ఎన్నికల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. మంథని మున్సిపల్ పరిధిలో 13 వార్డులకు గాను వార్డుల వారిగా రిజర్వేషన్లను సైతం ప్రభుత్వం అధికారికంగా ఖరారు చేసింది. మంథని మున్సిపాలిటీలోని ఒకటో వార్డు ఎస్టి కి కేటాయించగా, రెండో వార్డు ఎస్సీ జనరల్,మూడో వార్డు జనరల్, నాలుగో వార్డ్ ఎస్సీ మహిళ, ఐదో వార్డు జనరల్, ఆరో వార్డు జనరల్ మహిళ, ఏడో వార్డు జనరల్ మహిళగా, ఎనిమిదో వార్డు జనరల్ మహిళగా,తొమ్మిదో వార్డు జనరల్ మహిళ కు కేటాయించగా పదో వార్డు బీసీ జనరల్, పదకొండవ వార్డు బీసీ జనరల్, పన్నెండవ వార్డు బిసి మహిళ,పదమూడవ వార్డ్ జనరల్ గా రిజర్వేషన్లను నిర్ధారించారు.మంథని మేజర్ గ్రామపంచాయతీ 2ఆగస్టు 2018 నుండి మున్సిపాలిటీగా ఆవిర్భవించిన తర్వాత జరిగిన తొలి మున్సిపల్ ఎన్నికల్లో జనరల్ మహిళకు మున్సిపల్ చైర్మన్ పదవి కేటాయించగా బీసీ మహిళ చైర్మన్ పదవిని దక్కించుకుంది. ఆ తర్వాత జరుగుతున్న రెండో ఎన్నికల్లో చైర్మన్ పదవి బీసీ జనరల్ కు దక్కడంతో బీసీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆశావహులు వార్డుల వారిగా పోటీ చేసేందుకు పార్టీ టికెట్లు పొందేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు రిజర్వేషన్లను ప్రకటించిన క్షణం నుంచి కుల పెద్ద మనుషులకు, వార్డులో పలుకుబడి ఉన్న వ్యక్తులకు ఫోన్లు చేసి నేను పోటీలో ఉంటున్నాను ఆశీర్వదించండి అంటూ పలకరిస్తున్నారు.

## సంగారెడ్డిలో ఎమ్మెల్యేగా
# పోటీ చేయను: జగ్గారెడ్డి

**సంగారెడ్డి, జనవరి18:** కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సంచలన కామెంట్స్ చేశారు. తాను జీవితంలో సంగారెడ్డి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయనంటూ ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జగ్గారెడ్డి మాట్లాడుతూ..' ఏఐసీసీ సీనియర్ నేత రాహుల్ గాంధీని.. నేను సంగారెడ్డికి పిలిచి అవమానించానేమో అని ఫీల్ అయ్యాను. నాకోసం ఆయన సంగారెడ్డికి వచ్చారు. నన్ను గెలిపించాలని గట్టిగా ప్రచారం చేశారు. అంతగా ఆయన ప్రచారం చేసినప్పటికీ ఇక్కడి ప్రజలు నన్ను ఓడించారు. నేను చాలా ఆవేదన చెందాను. అందుకే సంగారెడ్డిలో నేను ఎమ్మెల్యేగా జీవితంలో పోటీ చేయను' అని అన్నారు.'రాహుల్ గాంధీ నా భుజంపై చేయివేసి జగ్గారెడ్డిని గెలిపించాలని అడిగితే.. నన్ను ఇక్కడి వారు ఓడించారు. నా జీవితంలో ఈ ఓటమి మరిచిపోలేనిది. నా ఓటమికి కారణం పేద ప్రజలు కాదు. సంగారెడ్డిలోని మేధావులు, కొందరు పెద్దలు మాత్రమే. రేపటి రోజు సంగారెడ్డిలో నా భార్య నిర్మలా పోటీచేసినా నేను ప్రచారానికి రాను. భవిష్యత్తులో రాష్ట్రంలో ఎక్కడికైనా వెళ్లి ప్రచారం చేస్తాను. కానీ.. సంగారెడ్డిలో మాత్రం చేయను' అంటూ జగ్గారెడ్డి సంచలన కామెంట్స్ చేశారు.




# ఒక్కసారిగా... పెరిగిన భక్తజనం

**మెరుపు వేగంతో అప్రమత్తమైన పోలీసులు**

**తానే స్వయంగా రంగంలోకి దిగి క్లిష్ట పరిస్థితిని చక్కదిద్దిన జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాద్ కేకన్**

**ములుగు:** సంక్రాంతి సెలవుల్లో మేడారం వనదేవతల దర్శనానికి భక్తుజనం భారీగా తరలివచ్చారు. సంక్రాంతి సెలవుల సందర్భంగా అంచనాలకు మించి భారీసంఖ్యలో మేడారం వనదేవతలను దర్శనానికి ఒక్కసారిగా భక్తజనం వెల్లువలా తరలివచ్చారు. అంచనాలకు మించి భక్తజనం మేడారం బాట పట్టడంతో, ట్రాఫిక్ తోనూ, దర్శన సమయంలోనూ భక్తులు ఇబ్బంది పడే ప్రమాదాన్ని ముందే పసిగట్టిన ములుగు జిల్లా ఎస్ పి సుధీర్ రాంనాథ్ కేకన్ తానే స్వయంగా రంగంలోకి దిగారు.భక్తుల రద్దీ నియంత్రణ కోసం యాక్సెస్ కంట్రోల్, క్యూలైన్ నిర్వహణ వంటి చర్యలను సమర్థవంతంగా అమలు చేయడంతో భక్తులు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్శనం చేసుకున్నారు. మేడారానికి వెళ్లే అన్ని ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్ నిర్వహణ కోసం 300 మందికిపైగా పోలీసు సిబ్బందిని మోహరించారు. సరైన డైవర్షన్ ప్లాన్ అమలు చేయడంతో ఎక్కడా వాహనాల రద్దీ లేకుండా సజావుగా ట్రాఫిక్ కొనసాగింది. ఈ బందోబస్తో మొత్తం 600 మందికిపైగా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఇందులో ఓఎస్డీ ములుగు శివం ఉపాధ్యాయ, ఏఎస్పీ ఏటూరునాగారం మనన్ బట్, అదనపు ఎస్పీ ఏఆర్ సదానందం, డీఎస్పీ ములుగు రవీందర్, ములుగు, భూపాలపల్లి, కరీంనగర్, మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు



చెందిన ఏసీపీ, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# హైదరాబాద్ రియల్ ఎస్టేట్‌లో కొత్త రూల్

**హైదరాబాద్, జనవరి 17:**హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్, పట్టణ అభివృద్ధిని ప్రభావితం చేస్తూ తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 10 అంతస్తులు దాటి నిర్మించే భవనాలకు టీడీఆర్ కొనుగోలు తప్పనిసరి చేసింది. చెరువులు, నదుల పరిరక్షణకు భూసేకరణను వేగవంతం చేసేందుకు ఆకర్షణీయమైన టీడీఆర్ ప్యాకేజీని ప్రకటించింది.హైదరాబాద్ మహానగరంలో రియల్ ఎస్టేట్ రంగాన్ని, పట్టణ అభివృద్ధిని ప్రభావితం చేసేలా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నగరంలోని చెరువులు, నదుల పరిరక్షణతో పాటు మౌలిక సదుపాయాల కల్పన కోసం భూసేకరణను వేగవంతం చేసేందుకు 'టీడీఆర్ణ నిబంధనలను సవరిస్తూ పురపాలక శాఖ జీవో నం.16ను విడుదల చేసింది. ఈ కొత్త ఉత్తర్వులు ఔటర్ రింగ్ రోడ్ వరకు విస్తరించిన తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని 300 డివిజన్లకు వర్తిస్తాయి.కొత్త నిబంధనల ప్రకారం.. నగరంలో 10 అంతస్తులు దాటి నిర్మించే ప్రతి భవనానికి టీడీఆర్ కొనుగోలు తప్పనిసరి చేశారు. 11వ అంతస్తు నుంచి పై అంతస్తుల వరకు మొత్తం నిర్మాణ విస్తీర్ణంలో 10 శాతానికి సమానమైన టీడీఆర్ సర్టిఫికెట్లను



బిల్డర్లు సమర్పించాల్సి ఉంటుంది. దీనివల్ల మార్కెట్‌లో నిల్వ ఉన్న టీడీఆర్ బాండ్లకు విపరీతమైన డిమాండ్ పెరుగుతుంది. ఒకవేళ బిల్డర్లు తమ భూమిని ప్రభుత్వానికి ఉచితంగా అప్పగిస్తే.. వారికి సెట్‌బ్యాక్, భవన ఎత్తు నిబంధనలలో ప్రత్యేక సడలింపులు కూడా కల్పిస్తారు.చెరువులు, నదుల సమీపంలోని పట్టా భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రభుత్వం ఆకర్షణీయమైన ప్యాకేజీని ప్రకటించింది. ఎఫ్‌టీఎల్ పూర్తిస్థాయి నీటి మట్టం పరిధిలోని భూములకు 200 శాతం టీడీఆర్, చెరువుల బఫర్ జోన్లలోని భూములకు 300 శాతం టీడీఆర్, బఫర్ వెలుపలి భూములు అభివృద్ధి కోసం సేకరిస్తే ఏకంగా 400 శాతం టీడీఆర్ ఇవ్వాలని నిర్ణయించారు. అయితే, భూసేకరణ విస్తీర్ణం ఒక ఎకరా కంటే ఎక్కువగా ఉంటే ఆ దరఖాస్తును ప్రభుత్వం నేరుగా పరిశీలిస్తుంది. మూసీ నది పరీవాహక ప్రాంతం, చెరువుల సుందరీకరణకు భూ యజమానుల నుంచి ఎదురవుతున్న అడ్డంకులను తొలగించడానికి ఈ నిర్ణయం దోహదపడనుంది.గతంలో జారీ చేసిన సుమారు రూ. 10 వేల కోట్ల విలువైన టీడీఆర్ సర్టిఫికెట్లు మార్కెట్‌లో పేరుకుపోయి, వాటి విలువ పడిపోయింది. ఫలితంగా యజమానులు భూములు ఇచ్చేందుకు నిరాకరిస్తూ నగదు పరిహారం కోరుతున్నారు. ఇప్పుడు పెద్ద భవనాల నిర్మాణానికి టీడీఆర్ తప్పనిసరి చేయడం వల్ల, బిల్డర్లు వీటిని కొనుగోలు చేయక తప్పదు. దీనివల్ల మార్కెట్‌లో టీడీఆర్ ధర పెరగడంతో పాటు, ప్రభుత్వంపై నగదు పరిహారం భారం తగ్గుతుంది. తద్వారా నిధుల కొరతతో ఆగిపోయిన రోడ్ల విస్తరణ, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టులు వేగవంతం కానున్నాయి.

### మంత్రి వివేక్ ఒంటెద్దు పోకడలను నిరసిస్తూ కాంగ్రెస్‌కు జడ్పీ మాజీ వైస్ చైర్మన్ రాజీనామా...



**మంచిర్యాల :** మున్సిపల్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీకి షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు ఉమ్మడి జిల్లా జడ్పీ మాజీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. మంత్రి వివేక్ వెంకటస్వామి పార్టీలో ఒంటెద్దు పోకడలు, ఏకపక్ష నిర్ణయాలు, నియంత పరిపాలన తీవ్రంగా కలిచి వేసిందని పేర్కొంటూ కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తున్నానని ప్రకటించారు. త్వరలో తాను అనుచరులతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నట్లు రాజిరెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా రాజీనామాకు గల కారణాలను లేఖ ద్వారా వివరించారు. కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు, చెన్నూర్ మేనిఫెస్టోకు ఆకర్షితుడినై గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ , స్థానిక శాసన సభ్యుడు గడ్డం వివేక్ విజయానికి విశేష కృషి చేశానని తెలిపారు. అయితే కాంగ్రెస్ ఇచ్చిన హామీలో ఏ ఒక్క హామీని నెరవేర్చ లేదని ఆరోపించారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ హామీలపై ప్రజల్లో తీవ్రమైన ప్రతికూల పరిస్థితులు ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. మంత్రి వివేక్ చెన్నూరు నియోజకవర్గానికి ప్రత్యేకంగా రూపొందించిన మేనిఫెస్టోలో ఒక్క హామీని నెరవేర్చ లేదని దుయ్యబట్టారు. దీనికి తోటు నియోజకవర్గంలో 45 వేల మంది యువకులకు ఉద్యోగాలు, మైనింగ్ ఇన్సిట్యూట్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు, అగ్రిరీసెర్చ్ సెంటర్, అగ్రికల్చర్ మినీ యూనివర్సిటీ, కరకట్టల నిర్మాణం హామీ ముందడుగు పడలేదని వెల్లడించారు. ఎమ్మెల్యే వివేక్‌పై ప్రజల్లో వస్తున్న వ్యతిరేకత, వివేక్ విడుదల చేసి మోసపూరిత మేనిఫెస్టోతో ప్రజల్లో విశ్వసనీయతను కోల్పోవడంతోనే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నానని ప్రకటించారు.

## లక్కీ డ్రాల పేరుతో
# సోషల్ మీడియాలో మోసాలు..

**సీపీ సజ్జనార్ స్ట్రాంగ్ వార్నింగ్**

**హైదరాబాద్, జనవరి17:** సోషల్ మీడియాలో లక్కీ డ్రాల పేరుతో జరుగుతున్న మోసాలపై హైదరాబాద్ సీపీ సజ్జనార్( స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. కార్లు, బైకులు, ప్లాట్లు, డీజేలు ఇస్తామంటూ ఆకర్షణీయ ప్రకటనలతో అమాయకులను మోసం చేస్తున్న సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్ష వేదికగా ట్వీట్ చేశారు సీపీ సజ్జనార్.

**ఫేక్ లక్కీ డ్రాలు..**

ఇటీవల సోషల్ మీడియా వేదికగా లక్కీ డ్రాల పేరుతో భారీగా మోసాలు జరుగుతున్నాయని గుర్తించామని అన్నారు. 'కేవలం రూ.99తో కారు గెలుచుకోండి. లక్కీ డ్రాలో బైక్, ప్లాట్, ఖరీదైన బహుమతులు' అంటూ ప్రచారం చేస్తూ ప్రజల ఆశలను ఆసరాగా చేసుకుని డబ్బులు వసూలు చేస్తున్నట్లు సీపీ తెలిపారు. ఈ స్కామ్‌లలో ముఖ్యంగా యువత, మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా నష్టపోతున్నారని సజ్జనార్ పేర్కొన్నారు.

**కొత్త మోసాలు..**

బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్లపై కఠిన చర్యలు తీసుకోవడంతో



కొంతమంది ఇన్‌ఫ్లూయెన్సర్లు కొత్త వేషాల్లో లక్కీ డ్రా స్కామ్‌లకు తెరలేపారని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. బెట్టింగ్ యాప్‌ల మాదిరిగానే వీటి ద్వారా కూడా ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసి, చివరికి ఎలాంటి బహుమతులు ఇవ్వకుండా మోసం చేస్తున్నారని చెప్పుకొచ్చారు. ఈ విషయంలో సీపీ సజ్జనార్ కఠినంగా స్పందించారు. సెలబ్రిటీలు, సోషల్ మీడియా స్టార్లయినా సరే ఎవరికీ మినహాయింపు లేదని స్పష్టం చేశారు. పాపులారిటీని అడ్డం పెట్టుకుని ప్రజలను దోచుకుంటే కఠిన చర్యలు తప్పవని సీపీ సజ్జనార్ హెచ్చరించారు.

**చట్టపరమైన చర్యలు తప్పవు..**

లక్కీ డ్రాల పేరుతో మోసాలకు పాల్పడే వారిపై ప్రైజ్ చిట్స్ అండ్ మనీ సర్క్యులేషన్ స్కీమ్స్(బ్యానింగ్) యాక్ట్ -- 1978 కింద కేసులు నమోదు చేస్తామని సీపీ సజ్జనార్ హెచ్చరించారు. అవసరమైతే ఐటీ యాక్ట్, చీటింగ్ కేసులు, క్రిమినల్ చట్టం కింద సెక్షన్లు విధించే అవకాశం ఉందని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.ప్రజలకు సూచనలు..ప్రజలు లక్కీ డ్రాల విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే ఆకర్షణీయ ప్రకటనలను నమ్మకండని.. ముందుగా డబ్బులు అడిగే లక్కీ డ్రాలు మోసమేనని, కార్లు, బైకులు, ప్లాట్లు ఇస్తామంటూ చేసే ఆఫర్లను నిర్ధారించుకోకుండా నమ్మొద్దని సూచించారు. అనుమానాస్పద ఖాతాలు, పోస్టులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని సీపీ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు. లక్కీ డ్రా స్కామ్‌లకు గురైన వారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో, సైబర్ క్రైమ్ విభాగంలో అధికారిక హెల్ప్‌లైన్స్ ద్వారా ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించారు.

## హైదరాబాద్‌లో
## హాట్ ఎయిర్ బెలూన్ షోలో అపశృతి



**హైదరాబాద్, జనవరి17 :** హైదరాబాద్ నగర శివారులో నిర్వహిస్తున్న హాట్ ఎయిర్ బెలూన్ షో( లో అపశృతి చోటుచేసుకుంది. సాంకేతిక సమస్య కారణంగా రెండు హాట్ ఎయిర్ బెలూన్‌లు ఇబ్రహీంబాద్ చెరువు -- మంచిర్యాల దేవాలయం సమీపంలో అత్యవసరంగా ల్యాండ్ కావాల్సి వచ్చింది. అయితే.. బెలూన్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. బెలూన్‌లో ఉన్న ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడ్డారు.

**ఘటనకు కారణమిదే..**

ఈ ఘటన శుక్రవారం.. గోల్కొండ నుంచి గండిపేట్ వైపు ప్రయాణిస్తున్న సమయంలో చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. హాట్ ఎయిర్ బెలూన్‌లో అవసరమైన స్థాయిలో గాలి లేకపోవడంతో, నియంత్రణ కోల్పోయే పరిస్థితి తలెత్తింది. దీంతో పైలట్ వెంటనే పరిస్థితిని అంచనావేసి చెరువు పక్కన అత్యవసర ల్యాండింగ్ చేసినట్లు తెలుస్తోంది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు బెలూన్ విషయాన్ని గమనించి అధికారులకు సమాచారమిచ్చారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే నిర్వాహకులు, సిబ్బంది అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

# అక్షర యోధుని విజయం

**ఖాకీ దౌర్జన్య ప్రయత్నం విఫలం**
**జర్నలిస్టులకు అండగా ఎన్.హెచ్.ఆర్.సి అభయం**
**అఖిల భారతీయ జర్నలిస్ట్ ప్రొటెక్షన్ ఫోర్స్ చైర్మన్ చుంచు కుమార్**



**వరంగల్,జనవరి 17 అక్షర సవాల్:** సత్యాన్ని నిగ్గుతేల్చే నిక్కార్సైన జర్నలిజం నేడు అనేక ఒత్తిళ్లు, బెదిరింపులు, తప్పుడు కేసుల మధ్య నిలబడుతున్న పరిస్థితుల్లో జర్నలిస్టులకు ఒక కీలకమైన న్యాయ విజయంగా ఈ ఘటన నిలుస్తోంది. ప్రజల కోసం నిజాలు వెలికి తీయాలనే ప్రయత్నంలో తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి పనిచేస్తున్న జర్నలిస్టులు, నీతి,నిజాయితీ తప్పిన కొంతమంది ఖాకీ అధికారుల అక్రమ చర్యల వల్ల తీవ్ర మానసిక, వృత్తి పరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాస్తవాన్ని ప్రముఖ పత్రిక సంపాదకులు, మన దునియా తెలుగు న్యూస్ పేపర్ ఎడిటర్ ఆకుల సుధాకర్ జాతీయ హ్యూమన్ రైట్స్ మానవ హక్కుల సంఘం దృష్టికి తీసుకెళ్లారు. జర్నలిస్టులపై జరుగుతున్న అక్రమ వేధింపులపై ఫిర్యాదును స్వీకరించిన మానవ హక్కుల సంఘం, ఈ వ్యవహారాన్ని అత్యంత గంభీరంగా పరిగణించింది. వెంటనే సమగ్ర విచారణ జరపాలని వరంగల్ పోలీస్ కమిషనర్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. దీంతో సంబంధిత అధికారుల చర్యలపై విచారణ తప్పనిసరిగా జరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో నల్లబెల్లి ఎస్సై వాడిచర్ల గోవర్ధన్ వ్యవహారంపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటారా, లేక తప్పు చేసిన ఖాకీని కాపాడే ప్రయత్నం జరుగుతుందా అన్న అంశంపై ప్రజల్లో ఉత్కంఠ నెలకొంది. వరంగల్ కమిషనర్ ఈ విషయంలో ఏ నిర్ణయం తీసుకుంటారన్నది ఇప్పుడు ప్రజాస్వామ్య వాదుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ ఘటనపై అఖిల భారతీయ జర్నలిస్ట్ ప్రొటెక్షన్ ఫోర్స్ చైర్మన్ చుంచు కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. జర్నలిస్టులపై ఇష్టానుసారంగా తప్పుడు కేసులు పెట్టి, బెదిరింపులకు గురి చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేఉశారు. ప్రజల కోసం నిజాలను నికా,ర్సుగా అక్షర యోధులపై దాడులు చేస్తే ఎంతటి అధికారులైనా వదిలిపెట్టబోమని హెచ్చరించారు. ఈ కేసులో వెంటనే సమగ్ర విచారణ జరిపి, తప్పు చేసిన ఎస్సైపై కఠినమైన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదే విషయంపై స్పందించిన జాతీయ మానవ హక్కుల కమిషన్ డైరెక్టర్, జర్నలిస్టులపై అక్రమ కేసులు, దౌర్జన్యాలు, బెదిరింపులు కొనసాగితే మానవ హక్కుల సంఘం కఠినంగా స్పందిస్తుందని స్పష్టం చేశారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ విషయంలో రాజీ పడే ప్రశ్నే లేదని, అవసరమైతే చట్టపరమైన చర్యలకు వెనుకాడబోమని ఆయన స్పష్టంగా ప్రకటించారు. ఇకపై జర్నలిస్టులకు ఎలాంటి అన్యాయం జరిగినా అఖిల భారతీయ జర్నలిస్ట్ ప్రొటెక్షన్ ఫోర్స్ చైర్మన్ ముందుండి పోరాటం చేస్తుందని, అక్షర స్వేచ్ఛను కాపాడేందుకు ముందు వరుసలో నిలబడుతుందని చుంచు కుమార్ భరోసా ఇచ్చారు. ఈ పరిణామం జర్నలిస్టులకు ధైర్యం నింపే సంకేతంగా మారిందని, ఖాకీ దౌర్జన్యానికి చెక్ పడే దిశగా ఇది ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జాతీయ హ్యూమన్ రైట్స్ మద్దతుతో అక్షర యోధుడికి న్యాయం దిశగా అడుగులు పడటం ప్రజాస్వామ్యానికి ఆశాజ్యోతి అని పలువురు జర్నలిస్టులు అభిప్రాయపడుతున్నారు.

## సంక్రాంతి క్రికెట్ పోటీల్లో వెంకటాపురం విజేత

**ట్రూ చాంపియన్స్ ఆధ్వర్యంలో ఘనంగా టోర్నమెంట్ ముగింపు**



**నెక్కొండ, జనవరి 17 అక్షర సవాల్:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని వెంకటాపురం గ్రామంలో ట్రూ చాంపియన్స్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నిర్వహించిన క్రికెట్ పోటీలు ఉత్సాహంగా ముగిశాయి. ఈ పోటీల్లో ఆతిథ్య గ్రామమైన వెంకటాపురం జట్టు ప్రథమ బహుమతిని కైవసం చేసుకోగా,పెద్ద కొర్పోల్ గ్రామ జట్టు రెండో స్థానంలో నిలిచింది. విజేత జట్లకు ముఖ్య అతిథులుగా హాజరైన సర్పంచ్ జాటోత్ కవిత–అఖిల్,ఉపసర్పంచ్ మల్లం కొండయ్య,మాజీ సర్పంచులు,మాజీ ఎంపీటీసీలు,వార్డు సభ్యులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ యువత క్రీడల్లో పాల్గొనడం శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణను పెంపొందిస్తుందని అన్నారు. గ్రామాల్లో ఇలాంటి క్రీడా కార్యక్రమాలు నిర్వహించడం వల్ల స్నేహభావం,ఐక్యత మరింత బలపడుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రూ చాంపియన్స్ యూత్ సభ్యులు,క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని పోటీలను విజయవంతం చేశారు.

## అరైవ్ అలైవ్ తో రోడ్డు భద్రత సందేశం

**టీఎస్ఆర్‌జేసీ జూనియర్ కళాశాలలో రంగోలి,వ్యాసరచన పోటీలు**





**నెక్కొండ,జనవరి 17అక్షర సవాల్:**వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు నెక్కొండ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత మాస ఉత్సవాల భాగంగా శనివారం నెక్కొండ టీఎస్ఆర్‌జేసీ బాలికల జూనియర్ కళాశాలలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా రోడ్డు భద్రత అంశంపై రంగోలి పోటీలు,వ్యాసరచన పోటీలను ఏర్పాటు చేశారు.కళాశాలకు చెందిన ఇంటర్మీడియట్,పదవ తరగతి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని,రోడ్డు భద్రతపై తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీదేవి,ఉపాధ్యాయ బృందం,నెక్కొండ పోలీస్ స్టేషన్ ఎస్సై ఎం.మహేందర్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.రోడ్డు భద్రతపై చక్కటి సందేశాలు అందిస్తూ రూపొందించిన రంగోలిల్లో,అలాగే వ్యాసరచనలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మొదటి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై ఎం.మహేందర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని,ట్రాఫిక్ నిబంధనలు పాటించడమే ప్రాణ రక్షణకు మార్గమని విద్యార్థులకు సూచించారు.ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెరిగి,భవిష్యత్తులో వారు బాధ్యతాయుత పౌరులుగా మారతారని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## పిఎసిఎస్-ఎఫ్ఎస్‌సిఎస్ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరించిన డీసీఓ



**వరంగల్, జనవరి 17 అక్షర సవాల్:** పిఎసిఎస్-ఎఫ్ఎస్‌సిఎస్ ఉద్యోగుల 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా కేంద్రంలో వరంగల్ జిల్లా డీసీఓ ఎం.నీరజ శనివారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీసీఓ నీరజ మాట్లాడుతూ సహకార వ్యవస్థలో ఉద్యోగుల పాత్ర కీలకమని,ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి ఉద్యోగి బాధ్యతతో పనిచేయాలని సూచించారు. ఉద్యోగుల ఐక్యత,క్రమశిక్షణ సంస్థల బలోపేతానికి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈగ వెంకటేశ్వర్లు,రవికిరణ్,రాజు,సోమశేఖర్,మేఘన,తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,వరంగల్ జిల్లా అధ్యక్షులు మోడెం సురేష్,వర్కింగ్ ప్రెసిడెంట్ మొగిలి,జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకాయల సురేష్,కోశాధికారి రాచమల్ల రమణాచారి,కార్యదర్శులు ప్రదీప్,దామోదర్,మురళి,సదాశివుడు,క్రాంతి,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఐనవోలు కు పోటేత్తిన భక్తులు..





**వరంగల్, జనవరి 17 అక్షర సవాల్ :** ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానం నందు 2026 సంవత్సరం జాతర సందర్భంగా భక్తులు తండోప తండాలుగా.. పొటే త్తారు. శనివారం సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ముందుగా విఘ్నేశ్వరపూజ మరియు పుణ్యాహవచనము, సంప్రోక్షణ మహన్యాసపూర్వక శత రుద్రాభిషేకములు, అన్నపూజ మహానివేదన, నీరాజన మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ, సమారాధన మహాదాశీర్వచనము, పండిత సన్మానములు. ఈ కార్యక్రమంలో దేవాలయ కార్యనిర్వహణాధికారి కందుల సుధాకర్, చైర్మన్ కమ్మగొని ప్రభాకర్, ఎస్.ఐ శ్రీనివాస్,ఉప ప్రధానార్చకులు పాతర్లపాటి రవీందర్ ముఖ్య అర్చకులు పాతర్లపాటి శ్రీనివాస్, ఐనవోలు మధుకర్ శర్మ, వేదపండితులు గట్టు పురుషోత్తం శర్మ, విక్రాంత్ వినాయక్ జోషి, అర్చకులు నందనం భాను ప్రసాద్ శర్మ నందనం మధు, ఉప్పుల శ్రీనివాస్,పాతర్లపాటి నరేష్ శర్మ, మడికొండ దేవేందర్ అర్చక సిబ్బంది ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

## యువతకు రాజకీయ ప్రాధాన్యత
# తండాల అభివృద్ధికి కేసీఆర్ బాటే మార్గం

**చెన్నారావుపేటలో బీఆర్ఎస్ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి వ్యాఖ్యలు**





**చెన్నారావుపేట, జనవరి 17 అక్షర సవాల్:** యువతకు రాజకీయంగా,ఉద్యోగపరంగా,ఉపాధి పరంగా నిజమైన అవకాశాలు బీఆర్ఎస్ పార్టీలోనే లభిస్తాయని నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. చెన్నారావుపేట మండలంలోని కోనాపురం యువత నూతనంగా ఏర్పాటైన యూత్ కమిటీ సభ్యులతో కలిసి ఆయనను మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా మాట్లాడుతూ,యువతకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని భరోసా ఇచ్చారు.నూతన యూత్ కమిటీని అభినందిస్తూ,బీఆర్ఎస్‌తోనే యువత భవిష్యత్తు సురక్షితమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. మార్పు పేరుతో నిరుద్యోగులను కాంగ్రెస్ మోసం చేసిందని, యువతకు ఉపాధి కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.అనంతరం చెన్నారావుపేట మండలం బాపునగర్ గ్రామపంచాయతీ పరిధిలో బీఆర్ఎస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తండాలను గ్రామపంచాయతీలుగా మార్చి అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌దేనని,మండలంలోని అన్ని తండాలకు బీటీ రోడ్లు మంజూరు చేస్తే, ప్రస్తుత ఎమ్మెల్యే వాటిని రద్దు చేశాడని,కాంగ్రెస్ ప్రభుత్వం తండాల్లో చేసిన అభివృద్ధి శూన్యమని ఆరోపించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రతి తండా,ప్రతి గ్రామ అభివృద్ధికి కృషి చేశానని గుర్తు చేశారు. గిరిజనులను రాజకీయాల పేరుతో విడగొట్టి అభివృద్ధిని అడ్డుకుంటోంది కాంగ్రెస్ పార్టీ అని విమర్శించారు. ఉద్యోగాల పేరుతో యువతను మోసగించి ఓట్లు వేయించుకున్న ప్రభుత్వం,నేటికీ గిరిజనులకు ఒక్క ప్రత్యేక ఉద్యోగం కూడా ఇవ్వలేకపోయిందన్నారు. రెండు సంవత్సరాల్లో మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం వస్తుందని,తండాల అభివృద్ధి బాధ్యత మళ్లీ నాదేనని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో మండల పార్టీ అధ్యక్షులు బాల్నే వెంకన్న,మండల ఎన్నికల కన్వీనర్ జక్క అశోక్ యాదవ్,మండల అధికార ప్రతినిధి కంది కృష్ణ చైతన్య,సొసైటీ చైర్మన్ మురహరి రవి,మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అనుముల కుమారస్వామి,మండల ప్రధాన కార్యదర్శి మాదారపు శ్రీనివాస్,మండల యూత్ ప్రెసిడెంట్ మంచోజు మనోజ్,సీనియర్ నాయకులు జున్నుతుల మహేందర్ రెడ్డి,ములుక సాంబయ్య కవి,మాజీ సర్పంచ్ మంగమ్మ మేగ్య నాయక్,గ్రామ పార్టీ అధ్యక్షులు,సర్పంచులు,మాజీ ప్రజాప్రతినిధులు,యూత్ నాయకులు,మహిళలు,బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు జాటోతు అమ్ములు ఎంపిక



**గూడూరు,జనవరి17 అక్షర సవాల్:** గూడూరు మండలం జడ్పీహెచ్ఎస్ తీగల వేణి పాఠశాలకు చెందిన ఆరవ తరగతి విద్యార్థిని జాటోతు అమ్ములు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు షారుక్, గొల్లపూడి రాణి పీడీలు తెలిపారు. ఈనెల 15వ తేదీన మహబూబాబాద్ జిల్లాలో అథ్లెటిక్స్ అసోసియేషన్ వారు నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపికలో పాల్గొని సబ్ జూనియర్ అభ్యర్థిలో 60 మీటర్ల విభాగంలో జిల్లా స్థాయిలో మొదటి స్థానం సంపాదించి తేదీ నేడు జనవరి 18 న ఆదిలాబాద్ లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయినది. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు షారుక్ ఉపాధ్యాయుల బృందం, గ్రామ సర్పంచ్ ధారావత్ రాజు అభినందించారు.

# మేడారంపై పోలీసుల ప్రత్యేక నజర్

**- కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను పరిశీలించిన మంత్రి సీతక్క**
**- 450 సీసీ కెమెరాలతో కట్టుదిట్టమైన నిఘా**
**- భద్రత విషయంలో ఎలాంటి రాజీ వద్దు**





**మంగపేట/తాడ్వాయి/ జనవరి17, అక్షర సవాల్:**మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ మహా జాతర సందర్భంగా శాంతి భద్రతల ఏర్పాట్లపై రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ప్రత్యేక దృష్టి సారించారు ఈ సందర్భంగా మంత్రి సీతక్క మేడారంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించి, అక్కడి నుంచి కొనసాగుతున్న భద్రత ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు జాతర ప్రాంతం అంతటా సుమారు 450 సీసీ కెమెరాల ద్వారా పోలీసులు కట్టుదిట్టమైన నిఘా కొనసాగిస్తున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోని భారీ ఎల్ఈడీ స్క్రీన్‌పై జాతర ప్రాంగణంలో జరుగుతున్న కార్యక్రమాలు, భక్తుల రాకపోకలు, జనసాంద్రత పరిస్థితులను మంత్రి సీతక్క ప్రత్యక్షంగా వీక్షించారు ఈ సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరిగితే పోలీసులు ఎలా స్పందిస్తారు, ముందస్తు చర్యలు, సన్నాహాలు ఏమిటన్న అంశాలను పోలీస్ అధికారులు మంత్రికి వివరించారు భద్రత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, ప్రతి చిన్న అంశాన్ని కూడా అప్రమత్తతతో పర్యవేక్షించాలని మంత్రి సీతక్క పోలీస్ అధికారులకు స్పష్టంగా ఆదేశించారు భక్తులు నిర్భయంగా ప్రశాంతంగా జాతరలో పాల్గొనేలా భద్రతా ఏర్పాట్లు ఉండాలని, పోలీస్ యంత్రాంగం 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణే ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యమని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీ.ఎస్., జిల్లా ఎస్పీ రామ్‌నాథ్ కేకన్, ఐటిడిఏ పి ఓ చిత్ర మిశ్రా, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ ప్రభుత్వం పిచ్చోడు చేతిలో రాయిలా మారింది

**సికింద్రాబాద్ అస్థిత్వాన్ని చెరిపేస్తున్నారు.**

**విధ్వంస ప్రణాళికలతోనే ముందుకు పోతున్న రేవంత్:కేటీఆర్**



**హైదరాబాద్:**చారిత్రకంగా హైదరాబాద్--సికింద్రాబాద్ జంట నగరాలుగా పెద్ద నగరంగా విస్తరించాయి. ఈ రెండు నగరాలు ప్రపంచవ్యాప్తంగా జంట నగరాలుగా పేరుపొందాయి. గతంలో పుస్తకాల్లో చదువుకున్న తుగ్లక్ గురించి ఈరోజు అందరికీ కనిపిస్తున్నది. తుగ్లక్ పాలన అంటే ఎట్లా ఉంటుందో రేవంత్ రెడ్డిని చూసి అర్థం చేసుకుంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారుర.శనివారం తెలంగాణ భవన్ దగ్గర మీడియాతో అయన మాట్లాడారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పిచ్చోడు చేతిలో రాయిలా మారింది. ఆరు గ్యారెంటీలు, 420 హామీల పేరు చెప్పి అధికారంలోకి వచ్చావు. హామీల అమలును పక్కనపెట్టి కేవలం పేర్లు మార్చడంపైనే ఫోకస్ పెట్టాడు. మొదట టీఎస్ తీసేసి టీజీ అన్నారు. అ తర్వాత తెలంగాణ తల్లిని మార్చారు. తెలంగాణ తల్లి నుంచి బతుకమ్మను తీసేశారు. అధికార చిహ్నం నుంచి కాకతీయ కళా తోరణాన్ని, చార్మినార్ను తీసివేశారు. వీటన్నిటి వలన ప్రజలకు ఏమాత్రం లాభం జరిగిందో ప్రభుత్వం చెప్పాలి. ఇలాంటి పిచ్చి పనులు తుగ్లక్ పనులు తప్పించి రేవంత్ రెడ్డి చేసింది ఏమీ లేదని అన్నారు.ప్రజల దగ్గరికి పాలన పోవాలని, అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందాలని వికేంద్రీకరణను ఒక విశాల దృక్పథంతోనే కేసీఆర్ ప్రారంభించారు. కొత్త గ్రామాలు, మండలాలు, రెవెన్యూ డివిజన్లు, జిల్లాలను ఏర్పాటు చేశారు. 10 జిల్లాలను 33 జిల్లాలుగా మార్చారు. హైదరాబాదులోనూ వార్డులను, జోన్లను పెంచడం జరిగింది. వాటికి అభివృద్ధి నిధులను కూడా అధికంగా ఇవ్వడం జరిగింది. హైదరాబాద్--సికింద్రాబాద్ అనేది తెలంగాణ ప్రజల గొప్ప అస్తిత్వ చిహ్నాలు. కానీ రేవంత్ రెడ్డి తీసుకున్న తుగ్లక్ నిర్ణయం వలన సికింద్రాబాద్కు చారిత్రక గుర్తింపు పూర్తిగా పోయేటట్లు ఉంది. సికింద్రాబాద్లోని అన్ని వర్గాల ప్రజలు ఒక్కటై ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారు. ప్రజలంతా సంఘటితమై, మా పార్టీని ఆహ్వానించడం జరిగింది. అక్కడ ఉన్న ప్రజాప్రతినిధులు మొత్తం మా పార్టీకి చెందిన వారే. సికింద్రాబాద్లో పుట్టిన బిడ్డలుగా సికింద్రాబాద్ అస్తిత్వాన్ని కాపాడాలి అని సికింద్రాబాద్ ప్రజలు పోరాటం చేస్తున్నారు. అధికారం ఇచ్చింది పట్టణాల అస్తిత్వాలను, ప్రజల అస్తిత్వాలను గుర్తు లేకుండా చెరిపివేయడం కోసం కాదని అన్నారు.అధికారం ఇచ్చింది గ్యారెంటీలను అమలు చేయడానికి, ప్రజలకు మంచి చేయాలని. కానీ ఇలాంటి ఒక్క పని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం, రేవంత్ రెడ్డి చేయడం లేదు. హైదరాబాద్ నగరంలో రెండు సంవత్సరాలుగా ఒక్క ఇటుక కూడా పెట్టలేదు. ఒక్క రోడ్డు కూడా వేయలేదు. ఇక ఇల్లు కూడా కట్టలేదు. కానీ నగరం మొత్తం తన విధ్వంస ప్రణాళికలతోనే ముందుకు పోతున్నాడు. ఈరోజు శాంతి ర్యాలీ పేరుతో సికింద్రాబాద్ ప్రజలు, ప్రజాప్రతినిధులు ఒక కార్యక్రమాన్ని శాంతియుతంగా చేపట్టారు. ప్రజల కోరిక మేరకు, ప్రజాప్రతినిధుల కోరిక మేరకు తెలంగాణ భవన్ నుంచి బయలుదేరి వెళ్తామని సిద్ధంగా ఉన్నాము. కానీ నిన్న రాత్రి వరకు అనుమతి ఉందని చెప్పి, ఇప్పుడు అనుమతి లేదని చెప్పి వేలాది మందిని, కార్పొరేటర్లను, మాజీ కార్పొరేటర్లను, పార్టీ సీనియర్ నాయకులను, సాధారణ ప్రజలను ఎక్కడికక్కడ అరెస్టు చేయడం జరిగిందని అన్నారు.ఇంత అరాచకంగా, అక్రమంగా పనిచేస్తున్న ప్రభుత్వం గుర్తుపెట్టుకోవాలి --- అధికారం శాశ్వతం కాదు అని. ఇప్పుడున్న పదవిలో ఎల్లకాలం కొనసాగడు రేవంత్ రెడ్డి అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఇప్పటికైనా సికింద్రాబాద్ అస్తిత్వాన్ని చెరిపివేసే ప్రయత్నం మానుకోవాలి. ఈరోజు శాంతి ర్యాలీని భగ్నం చేశామని చెప్పి రేవంత్ రెడ్డి, ఆయన ప్రభుత్వం పైశాచిక ఆనందం పొందవచ్చు. కానీ ఇది తాత్కాలికం మాత్రమే. రాజ్యాంగబద్ధంగా నిరసన తెలిపే మా హక్కును కచ్చితంగా ఉపయోగించుకుంటూ మరోసారి కోర్టుకు వెళ్లి శాంతి ర్యాలీని నిర్వహించుకుంటాం. కేవలం శాంతి ర్యాలీ మాత్రమే కాకుండా, అనేక ఇతర కార్యక్రమాలతో సికింద్రాబాద్ ప్రజల పోరాటానికి అండగా ఉంటామని అన్నారు. మరోసారి తిరిగి ప్రజల ఆశీర్వాదంతో మా ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది. మన ప్రభుత్వం వచ్చిన తర్వాత సికింద్రాబాద్ను మరొక జిల్లాగా మారుస్తాం. ప్రజల ఆకాంక్షల మేరకు వారి డిమాండ్లన్నింటిని రాబోయే మా ప్రభుత్వంలో నెరవేర్చడం జరుగుతుంది. ఫ్యూచర్ లేని ముఖ్యమంత్రి ఫ్యూచర్ సిటీ కడతామని అంటున్నాడు. 10 సంవత్సరాల తర్వాత ఉన్న జిల్లాలను తీసివేస్తామని రేవంత్ రెడ్డి అంటున్నాడు. చిన్న జిల్లాలతో ప్రజల దగ్గర అధికారులు వస్తే రేవంత్ రెడ్డికి ఉన్న నొప్పి ఏమిటో అర్థం కావడం లేదు. రాష్ట్ర సచివాలయం కంటే గొప్పగా కట్టుకున్న సమీకృత కలెక్టరేట్ల ద్వారా ప్రజలకు పాలన అందుతుంటే రేవంత్ రెడ్డికి ఏం సమస్య ఉందో అర్థం కావడం లేదని అన్నారు.ఈరోజు వేలాది మందిని ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. వారందరినీ వెంటనే భేషరతుగా విడుదల చేయాలి. ఎక్కడికక్కడ ప్రజలను అరెస్టు చేయడం, ప్రజలకు నిరసన తప్పు లేకుండా చేయడమే ప్రజాపాలన అని ప్రశ్నించారు.తెలంగాణలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలపై రాహుల్ గాంధీ స్పందించాలి. అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఆయన గుర్తించాలి. ఇంత దారుణంగా, అక్రమంగా, అన్యాయంగా వ్యవహరించడమే రాజ్యాంగ స్ఫూర్తి అనే విషయాన్ని రాహుల్ గాంధీ చెప్పాలని అన్నారు.

# భూభారతిలోనూ...అవే లోపాలు

- మొదటి పేజీ తరువాయి

డాక్యుమెంట్లు అప్‌లోడ్ కాకపోవడం వంటి సాంకేతిక సమస్యలతో రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ధరణిలో ఉన్న సమస్యలే ఇక్కడా కొనసాగుతున్నాయి, మాకు ఒరిగిందేమిటి అని రైతులు బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ యంత్రాంగం పర్యవేక్షణ లోపించడం వల్ల మధ్యవర్తులు మళ్లీ రంగప్రవేశం చేసి రైతులను నిలువునా దోచుకుంటున్నారు.గత ఎన్నికల్లో ధరణిపై ఉన్న ప్రజా వ్యతిరేకతను బీఆర్ఎస్ ప్రభుత్వం తక్కువ అంచనా వేసి భారీ మూల్యం చెల్లించుకుంది. ఇప్పుడు అదే బాటలో భూభారతి వల్ల వచ్చే ఫిర్యాదులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం ప్రమాదకరమని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. భూమి అనేది సగటు మనిషికి అత్యంత సెంటిమెంట్ , ఆర్థిక మూలాధారం. అక్కడ చిన్న తప్పు జరిగినా అది పాలనపై తీవ్ర వ్యతిరేకతకు దారి తీస్తుంది. భూభారతి పట్ల పెరుగుతున్న అసంతృప్తిని ప్రభుత్వం సకాలంలో గుర్తించకపోతే, అది రాబోయే ఎన్నికల్లో ప్రస్తుత ప్రభుత్వానికి చేదు అనుభవాలను మిగిల్చే అవకాశం ఉంది.అసలు ఇలాంటి స్కాములు ఎందుకు జరుగుతున్నాయి? వ్యవస్థలో పారదర్శకత ఎక్కడ లోపిస్తోంది? అనే ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. కేవలం ఒక పోర్టల్‌ను మార్చి మరొకటి తీసుకురావడం వల్ల ప్రయోజనం ఉండదు. అది పటిష్టమైన భద్రతతో, సామాన్యుడికి అర్థమయ్యేలా ఉండాలి. అధికారులు, ఐటీ నిపుణులు నిరంతరం పర్యవేక్షించని పక్షంలో ఏ వ్యవస్థ అయినా అక్రమార్కులకు అడ్డాగా మారుతుందన్న ఆందోళన కనిపిస్తోంది.

# వ్యూహాత్మక మౌనమే పరిష్కారమా...!

- మొదటి పేజీ తరువాయి



ఉంటూ ప్రతిపక్షాలను అణచివేసి, తెలంగాణ పోరాటకారులను దూరం చేసి, కొత్తలకు పదవులు పంచారు. ఇప్పుడు కాలె యాదయ్య, పోచారం శ్రీనివాస్ రెడ్డి వంటి ఎమ్మెల్యేలపై ఆరోపణలు చేస్తున్నారు. స్పీకర్ ఆధారాలు లేవని ప్రకటించినా, కేటీఆర్ సోషల్ మీడియాలో రాజ్యాంగ విలువలను ప్రశ్నిస్తున్నారు. అప్పటి ఫిరాయింపులు 'బంగారు తెలంగాణ' పేరుతో జరిగాయని ప్రజలు మరువలేదు కేటీఆర్.ప్రస్తుత పరిణామాల్లో మౌనం చాలా మంచిది. ప్రజలకు ఆలోచనకు సమయం ఇవ్వాలి. గత తప్పులకు పశ్చాత్తాపం చెంది, భవిష్యత్తులో అవి జరగకుండా హామీ ఇవ్వాలి. పడిగట్టు మాటలు, నాన్ స్టాప్ విమర్శలు ప్రజల మద్దతు ఆకర్షించవు. కేటీఆర్ దీన్ని గుర్తించి వ్యూహం మార్చితే పార్టీకి లాభం.అధికారంలో ఉంటూ అందరినీ 'గులాబీ కారు'లో ఎక్కించిన గతం ప్రజల మనసుల్లో ఉంది. ఇప్పుడు విమర్శలు చేసినా, స్వీయ పరిశీలన లేకపోవడం వల్ల ప్రజలు దూరమవుతున్నారు. తగిన సమయం కోసం వేచి ఉండి.. ప్రజల్లో వ్యతిరేకత వచ్చిన తర్వాత స్పందిస్తే ప్రజల మద్దతు లభిస్తుంది.

# అభాగ్యనగరం... వామ్మో... కాలుష్యం...

- మొదటి పేజీ తరువాయి

హెచ్చరిస్తున్నారు. ఈ పరిస్థితి కొనసాగితే, హైదరాబాద్ కూడా అదే పరిస్థితిని ఎదుర్కొనే ప్రమా దం ఉందని వారు చెబుతున్నారు.హైదరాబాద్‌లో పరిశ్రమలు నగరమంతటా చెల్లాచెదురుగా విస్తరించి ఉన్నాయి. ఇది వ్యవస్థీకృత పరిశ్రమల జోనింగ్ సూత్రాలను ఉల్లంఘిస్తోంది. నగర విస్తరణ సమయంలో శాస్త్రీ య విశ్లేషణలు, పౌర సంప్రదింపులు ఎక్కువగా లేకపోయాయి. ఒకప్పుడు హైదరాబాద్‌లో మూసారాంబాగ్ వంటి చారిత్రక 'బాగ్‌లు', అనేక చెరువులు ఉండేవి. కానీ అవి కనుమరుగవడం గాలి నాణ్యతపై నే రుగా ప్రభావం చూపింది. ప్రజా రవాణా ఇప్పటికీ విశ్వసనీయంగా లేకపోవడం, అం దుబాటులో లేకపోవడం వల్ల ప్రజలు వ్యక్తిగత వాహనాలపై ఆధారపడాల్సి రావడం మరో ప్రధాన కారణం.'హైదరాబాద్‌లో ఇప్పుడు ద్విచక్ర, త్రిచక్ర వాహనాల సాంద్రత అత్యధికంగా ఉంది. ఏటా లక్షల సంఖ్యలో వాహనాలు రోడ్లపైకి వస్తున్నాయి, దీనివల్ల ఉద్గారాలు గణనీయం గా పెరుగుతున్నాయ'ని ఒక పౌరుడు తెలిపారు. ప్రణాళిక లేని పరిశ్రమల అభివృద్ధి, ముఖ్యంగా రసాయన, ఔషధ పరిశ్రమలు, కాలుష్య భారాన్ని మరింత పెంచుతూ హైదరాబాద్ గాలిని రసాయనపరంగా మరింత విషపూరితంగా మారుస్తున్నాయి. కాలుష్యానికి మరో ప్రధాన కారణం హైదరాబాద్‌లో శాస్త్రీయ పట్టణ ఘన వ్యర్థాల నిర్వహణ లేకపోవడమే. 'చెత్తను తరచుగా కాల్చడం లేదా రోడ్ల పక్కన పడేయడం జరుగుతోంది. భారీ చెత్త కొండలు ఏర్పడి, జవహర్‌నగర్ వంటి ప్రాంతాలు డంపింగ్ యార్డులుగా మారా యి.ఇది పౌరులూ, జీహెచ్ఎంసీ రెండింటికీ చెందిన వైఫల్యం' అని ఆయన వివరించారు. అత్యంత కీలకమైన చివరి అంశం పౌర స్ఫూ ర్తి అని ప్రొఫెసర్ రెడ్డి పేర్కొన్నారు. గాలిలో నూ, నీటిలోనూ మైక్రో ప్లాస్టిక్స్ ఉన్నాయని ఆయన అన్నారు. పర్యావరణ పరిరక్షణను రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఏ(జీ) తప్పనిసరిగా పేర్కొన్నప్పటికీ, పౌరులు పర్యావరణా న్ని దెబ్బతీసే ఆచారాలను కొనసాగిస్తూనే ఉన్నారని ఆయన విమర్శించారు. స్థిరమైన ప్రణాళికలు అమలు చేయడానికి ప్రత్యేక రాష్ట్ర పర్యావరణ అభివృద్ధి కమిషన్ ఏర్పా టు చేయాలని పిలుపునిచ్చారు. మునిసిపల్ వ్యవస్థపై మరింత బలమైన బాధ్యత నిర్ధారణ అవసరమని డిమాండ్ చేశారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలికి చెందిన పర్యావరణ శాస్త్రవేత్త శరత్ కుమార్ హైదరాబాద్‌లో కాలుష్యం ఉందని అంగీకరించినప్పటికీ, అది ఢిల్లీ స్థాయికి చేరదని అన్నారు. 'ఏఐక్యూను అర్థం చేసుకోవడంలో చాలాసార్లు గందరగోళం ఏర్పడుతుంది. మనకు 50-100 మంచి స్థాయి, 100-200 సంతృప్తికర స్థాయి. ఢిల్లీ ఏఐక్యూ గణాంకాలు జాతీయ సగటుగా తీసుకోవడం వల్ల అవి తరచూ తప్పుగా అర్థం చేసుకోవాల్సి వస్తుంద'ని ఆయన వివరించారు. హైదరాబాద్‌లో ఏఐక్యూ ప్రాంతానికి, ప్రాంతానికి చాలా తేడా ఉంటుందని, సనత్‌నగర్, జూబ్లీహిల్స్ వంటి ప్రాంతాల్లో స్థానిక పరిస్థితుల ఆధారంగా మారుతుందని చెప్పారు. వాతావరణ పరిస్థితులు కూడా కొన్నిసార్లు కాలుష్యాన్ని తాత్కాలికంగా పెంచుతాయని తెలిపారు.ఐఐటీ కాన్పూర్‌తో కలిసి దాదాపు రూ.1 కోటి వ్యయంతో నిర్వహించిన సోర్స్ అపోర్షన్‌మెంట్ అధ్యయనం ప్రకారం రోడ్డు ధూళి 27--30 శాతం, వాహనాలు మరో 20--30 శాతం, పరిశ్రమలు సుమారు 15 శాతం కాలుష్యానికి కారణమని వెల్లడైంది. ప్రస్తుతం దాదాపు 500 అనుబంధ పరిశ్రమలను కవర్ చేసే కార్యాచరణ ప్రణాళిక అమల్లో ఉందని ఆయన తెలిపారు. ఇందులో ఆకస్మిక తనిఖీలు, వాహనాల పర్యవేక్షణ, ఎలక్ట్రిక్ వాహనాల ప్రోత్సాహం, చార్జింగ్ మౌలిక వసతుల విస్తరణ, మొక్కల నాట్లు, రియల్‌టైమ్ గాలి నాణ్యత పర్యవేక్షణ వంటి చర్యలు ఉన్నాయి. 'మన అవగాహన, చర్యలే కీలకం. ఉల్లంఘనలను అరికట్టడంలో పౌరుల భాగస్వామ్యం అత్యంత అవసరమ'ని శరత్ కుమార్ అన్నారు.ప్రముఖ పర్యావరణవేత్త ప్రొఫెసర్ కే పురుషోత్తం రెడ్డి ఒక కఠిన హెచ్చరిక జారీ చేస్తూ హైదరాబాద్ నిజంగానే ఢిల్లీ దిశగా కదులుతోందని అన్నారు. ఢిల్లీ భౌగోళిక పరిస్థితులు అక్కడి కాలుష్యాన్ని మరింత తీవ్రం చేస్తున్నాయని ఆయన వివరించారు. హిమాలయాలు, ఉత్తర పర్వత శ్రేణులు గోడలా నిలిచి, గాలిని అడ్డుకుంటాయని, దాంతో ధూళి అక్కడే చిక్కుకుపోతుందని చెప్పారు. అనేక ప్రాంతాల నుంచి వచ్చే ధూళి, థార్ ఎడారి నుంచి వచ్చే ఇసుకతో కలిసిపోయి, సూక్ష్మ కణాలను పెంచి గాలిని అత్యంత విషపూరితంగా మారుస్తోందని ఆయన అన్నారు.ఢిల్లీ అభివృద్ధిని ప్రణాళిక చేయడంలో పర్యావరణ పరిమితులను పర్యావరణ మంత్రిత్వ శాఖ చాలా ముందే పరిగణనలోకి తీసుకోవాల్సింద'ని ఆయన తెలిపారు. భారత ప్రభుత్వం అప్పుడప్పుడు మాత్రమే జాతీయ పట్టణీకరణ కమిషన్లను ఏర్పాటు చేసిందని ఆయన పేర్కొన్నారు. 'వారు మూడు లేదా నాలుగు సిఫారసులు చేశారు గానీ, ప్రకృతి పరిమితులను ఎప్పుడూ గంభీరంగా పరిగణించలేద' అని ఆయన అన్నారు.

# త్వరలో మున్సిపల్ ఎన్నికలు..

# కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాల్సిందే

- మొదటి పేజీ తరువాయి



అవసరం లేదని, కేంద్ర నిధులతోనే చేయవచ్చని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర పథకాలపై అబద్ధాలు ప్రచారం చేస్తోందని.. తప్పుడు సమాచారంతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని ఆరోపించారు. మున్సిపాలిటీల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించి కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. గ్రామాలు, పట్టణాల్లో కేంద్ర పథకాలను తీసుకెళ్లాలని సూచించారు. ఇటీవల త్రివేంద్రం ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేశామని.. కేరళలో కార్యకర్తలపై దాడులు జరిగినా పట్టువదలకుండా పనిచేశామని, ముంబై కార్పొరేషన్‌లోనూ గెలిచామని గుర్తుచేశారు. బీఎంసీ ఎన్నికల్లో 29 మున్సిపాలిటీల్లో 25 స్థానాల్లో బీజేపీ గెలిచిందని పేర్కొన్నారు.

**అందుకు మేం సిద్ధం..**

తెలంగాణ అభివృద్ధి చెందాలంటే బీజేపీని గెలిపించాలన్నారు రాంచందర్ రావు. ప్రజల సేవకు కమిట్మెంట్‌తో పనిచేస్తామని, ప్రజలతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన తెలిపారు. మున్సిపాలిటీలకు కేటాయించిన ప్రాంతాల్లో నాయకులు అక్కడే ఉండాలని, బీజేపీ జెండాను ఎగురవేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పిలుపునిచ్చారు.

# మూసీ ప్రక్షాళనకు టీడీఆర్

- మొదటి పేజీ తరువాయి



వెలుపలి భూములను ప్రభుత్వం సేకరించాల్సి వస్తే ఏకంగా 400 శాతం టీడీఆర్ ఇవ్వనున్నారు. ప్రైవేటు భూముల్లో నాలా విస్తరణ చేపడితే, రోడ్డు విస్తరణకు ఇచ్చే విధంగా 400 శాతం టీడీఆర్ వర్తింపజేస్తారు. దీని వల్ల నిర్వాసితులు ప్రభుత్వం నుంచి నగదు కోసం ఎదురు చూడాల్సిన పని లేదు. టీడీఆర్ సర్టిఫికెట్ల ద్వారా మార్కెట్‌లో మంచి లాభం పొందే ఛాన్స్ ఉంది. గత ప్రభుత్వ హయాంలో దాదాపు 10వేల కోట్లకుపైగా విలువైన టీడీఆర్ సర్టిఫికెట్లు జారీ అయ్యాయి. దీని వల్ల మార్కెట్‌లో వాటి సరఫరా పెరిగింది. దీంతో డిమాండ్ పడిపోయింది. దీని వల్ల భూ యజమానులు టీడీఆర్ తీసుకోవడానికి అంగీకరించడం లేదు. కేవలం నగదు రూపంలోనే పరిహారం అడుగుతున్నారు. అందుకే రూల్స్ మార్చిన ప్రభుత్వం ఈ ఇబ్బందిని అధిగమించాలని చూస్తోంది. అందుకే బిల్డర్స్‌కు కొన్ని రూల్స్ పెట్టింది. హైదరాబాద్‌లో పది అంతస్తులకు మించిన భవనాలు నిర్మిస్తే టీడీఆర్ వినియోగించుకోవాలి. అంటే 11 అంతస్తు నుంచి నిర్మించే ప్రతి ఫ్లోర్‌కు చదరపు అడుగు విస్తీర్ణంలో పది శాతానకకి సమానమైన టీడీఆర్ కచ్చితంగా కొనుగోలు చేయాలి. ఈ రూల్ వల్ల మార్కెట్‌లో టీడీఆర్‌కు ఒక్కసారిగా డిమాండ్ పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తుంది. టీడీఆర్‌లు చెల్లుబాటు అవుతాయని ప్రజలకు మేలు జరుగుతుందని అంచనా వేస్తున్నారు. టీడీఆర్ జారీ ప్రక్రియలో ఎటువంటి అక్రమాలు జరగకుండా ఉండేందుకు ప్రభుత్వ కఠినమైన రూల్స్ పెట్టింది. టీడీఆర్ ఇచ్చే ముందు ఇరిగేషన్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ స్థాయి అధికారుల నుంచి తప్పనిసరిగా క్లియరెన్స్ తీసుకోవాలి. భూ యజమాని అందుబాటులో లేకపోయినా లేదా టైటిల్ వివాదాలు ఉన్నా ఆ టీడీఆర్‌ను టీడీఆర్ బ్యాంకులో జమ చేస్తారు. వివాదం పరిష్కారమైన తర్వాత అసలు ఓనర్‌కు అప్పగిస్తారు. ఒక ఎకరం కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న భూములకు టీడీఆర్ ఇవ్వాలంటే ముందస్తుగా రాష్ట్ర ప్రభుత్వ అనుమతి తీసుకోవాలి. భూమిని ఉచితంగా ప్రభుత్వానికి అప్పగించే సంస్థలకు మరిన్ని ఆఫర్లు ప్రకటించింది ప్రభుత్వం. వారు తమ ప్రాజెక్టులో సెట్ బ్యాక్‌ల సడలింపు ఉంటుంది. అదనపు అంతస్తుల నిర్మాణం, అదనపు నిర్మిత విస్తీర్ణంలో వెసులుబాటు పొందవచ్చు. ఏ నిబంధన అయినా సరే ఫైర్, ఎయిర్‌పోర్టు అథారిటీ రూల్స్‌కు అనుగుణంగానే ఉంటుంది.

# శాంతియుత ర్యాలీపై కాంగ్రెస్ సర్కార్ ఉక్కుపాదం

- మొదటి పేజీ తరువాయి



మా పాలసీ అని నిరూపిస్తున్నారని విమర్శించారు.సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సాధన కోసం మా పార్టీ సీనియర్ నాయకులు తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో జరుగుతున్న శాంతియుత ర్యాలీని అడ్డుకోవడం, కార్యకర్తలను అరెస్టు చేయడం హేయమైన చర్య అని విమర్శించారు. ఈ అరెస్టులను తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడతామని చెప్పి.. అధికారంలోకి వచ్చాక రాష్ట్రాన్ని పోలీస్ రాజ్యంగా మార్చడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. గాంధేయ మార్గంలో శాంతియుతంగా చేస్తున్న ర్యాలీని అడ్డుకోవద్దని, అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు.. మీ నిర్బంధాలకు భయపడేది లేదని స్పష్టం చేశారు. చారిత్రక సికింద్రాబాద్ అస్తిత్వం కోసం మా పోరాటం ఆగదని అన్నారు.కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యమే మా ఏడవ గ్యారంటీ అని చెప్పిన రేవంత్ రెడ్డి నేడు ప్రశ్నించే గొంతుకలను పోలీసులతో అణచివేస్తూ నిరంకుశత్వమే మా పాలసీ అని నిరూపిస్తున్నారు.



# రోజూ సోంపును ఇలా తీసుకుంటే అద్భుతాలే..

వంటగదిలో ఉండే సుగంధ ద్రవ్యాలు కేవలం రుచికే కాదు, ఆరోగ్యానికి కూడా అమృతంతో సమానం. ముఖ్యంగా ఊబకాయం, పొట్ట చుట్టూ పేరుకుపోయిన కొవ్వుతో బాధపడేవారికి సోంపు ఒక వరం లాంటిది. సోంపును సరైన పద్ధతిలో తీసుకుంటే అద్భుతమైన ఫలితాలు పొందవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఆధునిక జీవనశైలి, ఆహారపు అలవాట్ల వల్ల నేడు చాలామందిని వేధిస్తున్న ప్రధాన సమస్య ఊబకాయం. జిమ్‌లకు వెళ్లలేక, కఠినమైన డైట్ చేయలేక ఇబ్బంది పడేవారికి మన వంటింట్లో ఉండే సోంపు అద్భుతమైన పరిష్కారాన్ని చూపుతుంది. అజీర్ణం, గ్యాస్, అసిడిటీ వంటి సమస్యలకే కాకుండా పొట్ట చుట్టూ పేరుకుపోయిన మొండి కొవ్వును కరిగించడంలో సోంపు కీలకంగా పనిచేస్తుంది. ఒక చెంచా సోంపును రాత్రంతా నీటిలో నానబెట్టండి. మరుసటి రోజు ఉదయం ఆ నీటిని మరిగించి, వడకట్టి ఖాళీ కడుపుతో తాగాలి. దీనివల్ల శరీరంలోని వ్యర్థాలు బయటకు వెళ్లిపోతాయి. క్రమం తప్పకుండా ఇలా చేస్తే శరీరంలో వచ్చే మార్పును మీరే గమనిస్తారు. ఒక గ్లాసు నీటిని మరిగించి, అందులో ఒక చెంచా సోంపు, చిన్న అల్లం ముక్క వేయాలి. స్టవ్ ఆఫ్ చేసిన తర్వాత కొన్ని పుదీనా ఆకులు వేసి రెండు నిమిషాలు మూత పెట్టాలి. ఆ తర్వాత వడకట్టి, అర చెంచా తేనె కలుపుకుని తాగాలి. ఇది జీవక్రియను వేగవంతం చేసి కొవ్వును త్వరగా కరిగిస్తుంది. సోంపును పాన్ మీద 2-3 నిమిషాలు దోరగా వేయించి, చల్లారాక మిక్సీ పట్టి పొడి చేసుకోవాలి. ఈ పొడిని గాలి చొరబడని గాజు సీసాలో భద్రపరుచుకోవాలి. ప్రతిరోజూ భోజనం చేసిన తర్వాత ఒకటి లేదా రెండు చిటికెల పొడిని తీసుకుంటే ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. 4 చెంచాల సోంపు, 2 చెంచాల జీలకర్ర, 2 చెంచాల మెంతులు కలిపి వేయించి పొడి చేసుకోవాలి. ఈ పొడిలో ఒక చెంచా పసుపు, ఒక చెంచా నల్ల ఉప్పు, తగినంత తేనె కలిపి చిన్న ఉండలుగా చుట్టుకోవాలి. రోజుకు ఒక ఉండ చొప్పున తీసుకుంటే శరీరంలోని అసమతుల్యత తగ్గి, ఆరోగ్యం మెరుగుపడుతుంది.

# పచ్చిమిర్చితో ఇన్ని అద్భుతాలా



పచ్చిమిరపకాయ కారం అని తెలిసినా, కళ్లలో నీళ్లు తిరుగుతున్నా ఆ రుచిని మనం వదులుకోలేం. ఈ మిర్చి కేవలం కారాన్ని మాత్రమే కాదు.. మన ఆరోగ్యానికి ఒక సంజీవని లాంటి ప్రయోజనాలను కూడా ఇస్తుందని మీకు తెలుసా? భారతీయ భోజనంలో పచ్చిమిరపకాయది ప్రత్యేక స్థానం. కూరగాయల మార్కెట్‌కు వెళ్తే.. పచ్చిమిరపకాయలు లేనిదే తిరిగి రారు. కళ్లలో నీళ్లు తెప్పించే ఈ పచ్చిమిరపకాయ కేవలం కారం మాత్రమే కాదు.. అది మన శరీరానికి చేసే మేలు అంతా ఇంతా కాదు. పచ్చిమిర్చిలో దాగున్న ఆ 5 అద్భుత ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. పచ్చిమిరపకాయల్లో ఉండే క్యాప్సైసిన్ అనే సమ్మేళనం శరీర జీవక్రియను వేగవంతం చేస్తుంది. దీనివల్ల శరీరంలో పేరుకుపోయిన కొవ్వు వేగంగా కరుగుతుంది. మీరు రుచికరమైన కారంగా ఉండే ఆహారం తింటూనే బరువు తగ్గవచ్చు. నారింజ పండ్లలో కంటే పచ్చిమిర్చిలో విటమిన్ సి అధికంగా ఉంటుందని మీకు తెలుసా? ఇది చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. చర్మంపై ముడతలను తగ్గించి ముఖానికి సహజమైన కాంతిని ఇస్తుంది. యవ్వనంగా కనిపించాలనుకునే వారికి పచ్చిమిర్చి ఒక సహజ సౌందర్య సాధనం. పచ్చిమిరపకాయలు రక్తంలోని కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్స్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. ఇది రక్తం గడ్డకట్టడాన్ని నివారించి, గుండెపోటు ప్రమాదాన్ని తగ్గిస్తుంది. గుండె ఆరోగ్యాన్ని కాపాడటంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది.విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండటం వల్ల పచ్చిమిర్చి రోగనిరోధక శక్తిని పెంచుతుంది. క్రమం తప్పకుండా మితంగా పచ్చిమిరపకాయలను తీసుకునే వారికి జలుబు, దగ్గు వంటి ఇన్ఫెక్షన్లు అంత త్వరగా దరిచేరవు. మితంగా పచ్చిమిర్చి తీసుకోవడం వల్ల లాలాజల ఉత్పత్తి పెరిగి, ఆహారం సులభంగా జీర్ణం కావడానికి సహాయపడుతుంది. ఇది ప్రేగుల ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తుంది. ఏదైనా అతిగా తింటే ప్రమాదమే. పచ్చిమిరపకాయలు ఎక్కువగా తింటే కడుపులో మంట, అసిడిటీ లేదా పైల్స్ వంటి సమస్యలు రావచ్చు. అందుకే రోజువారీ ఆహారంలో 2 నుంచి 3 పచ్చిమిరపకాయల కంటే ఎక్కువ తీసుకోకపోవడమే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

# రెడ్ మీట్‌ను ఇలా తింటే ఆ రోగాలను ఆహ్వానించినట్టే.!




చాలామంది ప్రోస్టేట్ సమస్యలు వయసుతో వస్తాయని భావిస్తారు. కానీ వేయించిన మాంసం, ప్రాసెస్డ్ ఫుడ్స్ దీనికి ప్రధాన కారణం. మూత్ర సంబంధిత ఇబ్బందులు, నొప్పి లాంటి లక్షణాలు తీవ్రమయ్యే ముందు సరైన ఆహారంతో క్యాన్సర్ లాంటి ముప్పులను నివారించవచ్చు. వయసు పెరుగుతున్న కొద్దీ పురుషుల్లో ప్రోస్టేట్ గ్రంథి సమస్యలు రావడం సాధారణమని చాలామంది నమ్ముతారు. అయితే, అది కరెక్ట్ కాదు. ఎందుకంటే మనం రోజువారీ తీసుకునే ఆహారం ఈ సమస్యలకు కీలక పాత్ర పోషిస్తుంది. మూత్రవిసర్జనలో ఇబ్బందులు, నొప్పి లాంటి లక్షణాలు తీవ్రమయ్యేవరకు చాలామంది ప్రోస్టేట్ ఆరోగ్యం గురించి పెద్దగా పట్టించుకోరు. కానీ, ఆహారపు అలవాట్లలో చిన్న మార్పులు చేసుకోవడం ద్వారా భవిష్యత్తులో వచ్చే క్యాన్సర్ లాంటి తీవ్రమైన సమస్యలను కూడా సమర్థవంతంగా నివారించవచ్చు. ప్రోస్టేట్ గ్రంథి పాడవడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. వీటిలో మూత్ర సంబంధిత ఇబ్బందులు కూడా ఉన్నాయి. తరచుగా మూత్ర విసర్జన చేయాల్సి రావడం, మూత్రాశయంలో నొప్పి, లేదా మూత్ర విసర్జన సమయంలో మంటగా ఉండటం లాంటివి లక్షణాలుగా చెప్పుకోవచ్చు. వీటితో పాటు పెల్విక్ లేదా నడుము నొప్పి, తుంటి దగ్గర అసౌకర్యం లేదా నొప్పి లాంటివి కూడా ఈ గ్రంథి చెడిపోవడం వల్ల వచ్చే సమస్యలు. లైంగిక బలహీనత, మూత్రం లేదా వీర్యంలో రక్తం కనిపించడం, ప్రోస్టేట్ క్యాన్సర్ లాంటి లక్షణాలు కూడా ఏర్పడవచ్చు. ప్రోస్టేట్ ఆరోగ్యకరంగా ఉండాలంటే మనం సరైన ఆహారం తీసుకోవాల్సిందే. ముఖ్యంగా అతిగా వేయించిన మాంసం, ప్రాసెస్డ్ మీట్ ఈ సమస్యకు ప్రధాన కారణమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రెడ్ మీట్‌ను అధిక ఉష్ణోగ్రత వద్ద కాల్చినప్పుడు లేదా వేయించినప్పుడు, అందులో హెటిరో సైక్లిక్ అమైన్స్ లాంటి హానికర రసాయనాలు విడుదలవుతాయి. ఈ రసాయనాలు ప్రోస్టేట్ గ్రంథిలో వాపును కలిగించి, కణాల అసాధారణ వృద్ధికి దోహదం చేస్తాయి. అలాగే, సోడియం, ప్రిజర్వేటివ్స్ ఎక్కువగా ఉండే సాసేజ్‌లు, బేకాన్ లాంటి ప్రాసెస్డ్ ఆహారాలను ఎంత త్వరగా మానేస్తే ప్రోస్టేట్ ఆరోగ్యానికి అంత మంచిది. ప్రోస్టేట్ సమస్యలను దూరం చేయాలంటే ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవడం మంచిది. పీచు పదార్థాలు ఎక్కువగా ఉండే కూరగాయలు, పండ్లను తీసుకోవడం వల్ల ప్రోస్టేట్ సమస్యలను అడ్డుకోవచ్చు. అలాగే టమాటాలు, పుచ్చకాయ లాంటి లైకోపిన్ అధికంగా ఉండే పదార్థాలను తీసుకోవడం ప్రోస్టేట్ గ్రంథి ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ప్రతిరోజు తగినంత నీరు తాగడం వల్ల శరీరం డిహైడ్రేషన్ బారిన పడకుండా ఉండొచ్చు. శారీరక శ్రమ, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల హార్మోన్ల సమతుల్యత దెబ్బతినకుండా ఉంటుంది.

# ఈ టైంలో పండ్ల జ్యూస్ తాగారంటే.. ఒంట్లో విష పదార్ధాలు హాంఫట్!



తాజా పండ్ల జ్యూస్‌లు ఆరోగ్యానికి అవసరమైన పోషకాలు ఎన్నో అందిస్తాయి. పండ్ల రసం తాగడానికి సరైన సమయం ఎప్పుడు? ఆరోగ్యంగా ఉండటానికి ఆహారంలో పండ్లను చేర్చుకోవడం మంచిదన్న సంగతి అందరికీ తెలిసిందే. చాలా మంది పండ్లు తినడానికి బదులుగా పండ్ల రసం తాగడానికి ఇష్టపడతారు. అయితే వేళాపళా లేకుండా ఎప్పుడుపడితే అప్పుడు పండ్ల జ్యూస్‌లు తాగడం వల్ల ప్రయోజనకరంగా ఉండటానికి బదులుగా ఆరోగ్యానికి హాని తలపెడతాయి. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం జ్యూస్ తాగడానికి ఒక నిర్దిష్ట సమయం ఉంది. ముఖ్యంగా ఉదయం పండ్ల రసం తాగడానికి ఉత్తమ సమయంగా పరిగణించబడుతుంది. రాత్రి నిద్ర తర్వాత, శరీరానికి శక్తి అవసరం. దీనిని తాజా పండ్ల రసం నుంచి వెంటనే పొందవచ్చు.ఉదయం ఖాళీ కడుపుతో లేదా అల్పాహారంతో జ్యూస్ తాగడం వల్ల శరీరం నుంచి విషాన్ని బయటకు పంపడంలో సహాయపడుతుంది. వ్యాయామం లేదా వ్యాయామం చేసిన అరగంట తర్వాత జ్యూస్ తాగడం ప్రయోజనకరంగా ఉంటుంది. ఇది వ్యాయామం సమయంలో ఖర్చు చేసిన శక్తిని పునరుద్ధరించడంలో సహాయపడుతుంది. ఉదయం జ్యూస్ తాగడం వల్ల శరీరంలో ఎలక్ట్రోలైట్ స్థాయిలు సమతుల్యంగా ఉంటాయి. అయితే రాత్రి పడుకునే ముందు పండ్ల రసం ఎప్పుడూ తాగకూడదు. ఇందులో సహజ చక్కెర (ఫ్రక్టోజ్) ఉంటుంది. ఇది రక్తంలో చక్కెరను పెంచుతుంది. నిద్రకు అంతరాయం కలిగిస్తుంది. రాత్రిపూట జీర్ణవ్యవస్థ మందగిస్తుంది. భోజనంతో పాటు జ్యూస్ తాగడం మానుకోవాలి. ఎందుకంటే ఇది జీర్ణ ప్రక్రియకు అంతరాయం కలిగిస్తుంది. గ్యాస్ లేదా అజీర్ణానికి కారణమవుతుంది. అదే సమయంలో జ్యూస్‌లో చక్కెర జోడించకుండా ఉండండి. ప్యాక్ చేసిన జ్యూస్‌ల కంటే తాజాగా తయారుచేసిన ఇంట్లో తయారుచేసిన జ్యూస్‌లను తాగడం మంచిది. ఈ జ్యూస్‌లలో ఫైబర్ తక్కువగా ఉంటుంది కాబట్టి, వీలైతే పండ్లు తినడం ఇంకా మంచిది.



# లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో అల్లు అర్జున్?

టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, కోలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ కాంబినేషన్‌లో ఒక భారీ పాన్ ఇండియా చిత్రం రాబోతుందని వార్తలు వైరలవుతున్న విషయం తెలిసిందే. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించి గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో రకరకాల ఊహాగానాలు వినిపిస్తుండగా.. తాజాగా ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి నేడు చిత్రయూనిట్ అప్‌డేట్ ఇవ్వబోతున్నట్లు తెలుస్తుంది. ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మించబోతున్నట్లు సమాచారం. అల్లు అర్జున్ కెరీర్‌లో 23వ చిత్రంగా ఈ సినిమా రాబోతుండగా.. అప్‌డేట్ ఎప్పుడూ వస్తుందా అని అభిమానులు ఆసక్తికరంగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌లో వచ్చిన 'పుష్ప' సిరీస్ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడంతో, ఈ కొత్త కాంబినేషన్‌పై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ముఖ్యంగా లోకేష్ కనగరాజ్ సినిమాలకు ఉండే ప్రత్యేకమైన 'హజఖ' (లోకేష్ సినిమాటిక్ యూనివర్స్) క్రేజ్ దృష్ట్యా, అల్లు అర్జున్ సినిమా కూడా అందులో భాగమవుతుందా లేదా అనేది అభిమానుల్లో పెద్ద చర్చకు దారితీసింది. ఈ చిత్రానికి సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ సంగీతాన్ని అందించబోతున్నట్లు సమాచారం. దీనిపై మరికొన్ని గంటల్లో క్లారిటీ రాబోతుంది. సినిమాల విషయానికి వస్తే అల్లు అర్జున్ ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో ఒక భారీ సైన్స్ ఫిక్షన్ మూవీ చేస్తున్నారు. ఆ సినిమా పనులన్నీ పూర్తయిన తర్వాత, 2026 జూన్ లేదా జూలై నెలలో లోకేష్ కనగరాజ్ ప్రాజెక్ట్ సెట్స్ మీదకు వెళ్లే అవకాశం ఉంది. ఈ సినిమా కోసం లోకేష్ కనగరాజ్ దాదాపు రూ.75 కోట్ల మేర భారీ పారితోషికాన్ని డిమాండ్ చేస్తున్నట్లు ఫిల్మ్ నగర్ టాక్ నడుస్తుంది. ఇది కేవలం యాక్షన్ డ్రామా మాత్రమే కాకుండా ఒక సరికొత్త కాన్సెప్ట్‌తో కూడిన హై-వోల్టేజ్ ఎంటర్‌టైనర్ అని ఇందులో బన్నీ మేకోవర్ మునుపెన్నడూ చూడని విధంగా ఉంటుందని తెలుస్తోంది.

# ఒక్క సీన్‌తో వైరల్.. 'టాక్సిక్' బ్యూటీ ఇన్‌స్టా డిలీట్




కన్నడ స్టార్ హీరో యశ్ కొత్త సినిమా టాక్సిక్ టీజర్ పాన్ ఇండియా రేంజ్‌లో హీట్ పెంచుతుంది. టీజర్‌లో ఉన్న ఇంటిమేట్ సీన్‌పై మహిళా సంఘాలు తీవ్రమైన అభ్యంతరం తెలిపాయి. యశ్‌తో పాటు బోల్డ్ సీన్‌లో కనిపించిన బీట్రీజ్ టోఫెన్ బాఖ్ (దీమ్ఫ్‌తీఱఓ ఝబటవఅఝ్ఎష్ట్ర) తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను తొలగించింది. తన ఇంటిమేట్ సీన్స్‌పై వివాదాలు రావడం వల్లనే ఆమె ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ మూవీని దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. టాక్సిక్ టీజర్‌లో చాలా బోల్డ్‌గా నటించిన తర్వాత ఆమె గురించి తెలుసుకోవాలని నెటిజన్లు పోటీపడ్డారు. ఈ క్రమంలో దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ ఆమె వివరాలు షేర్ చేశారు. దీంతో ఆమె పేరు బీట్రీజ్ బాఖ్ అని పంచుకున్నారు. హాలీవుడ్‌లో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆమెకు ఇదే ఫస్ట్ ఇండియన్ సినిమా... దీంతో ఆమెకు భారీగా ఫాలోవర్స్ పెరిగారు. జనవరి 13 వరకు ఆమె ఖాతా యాక్టివ్‌గానే ఉంది. కానీ, సెడెన్‌గా ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె ఖాతా కనిపించకపోవడంతో నెటిజన్లు ఈ విషయాన్ని షేర్ చేస్తున్నారు.

# ఓటీటీలోకి వచ్చేసిన 'దండోరా'.. స్ట్రీమింగ్ ఎక్కడంటే.!



తెలంగాణ పల్లెటూరి నేపథ్యం, కుల వివక్ష వంటి సున్నితమైన సామాజిక అంశంతో తెరకెక్కిన 'దండోరా' చిత్రం ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. ప్రమోషనల్ కంటెంట్‌తో మంచి బజ్ క్రియేట్ చేసిన ఈ సినిమాపై, విడుదలకి ముందు నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలు మరింత ఆసక్తిని పెంచాయి. అయితే థియేటర్‌లలో అలరించిన ఈ చిత్రం తాజాగా ఓటీటీలోకి వచ్చేసింది. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ చిత్రం నేటి నుంచి తెలుగుతో పాటు తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ అవుతుంది. శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, మనికా చిక్కాల, మౌనికా రెడ్డి, బిందు మాధవి, రాధ్య, అదితి భావరాజు తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటించగా.. మురళీకాంత్ దర్శకత్వం వహించాడు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. తెలంగాణలోని తుళ్లూరు అనే గ్రామం చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఆ ఊరిలో కుల వివక్ష వేళ్లూనుకుపోయి ఉంటుంది. ఎంతలా అంటే, తక్కువ కులానికి చెందిన వారు మరణిస్తే వారి అంత్యక్రియలు కూడా ఊరికి దూరంగా, ఎవరికీ కనిపించని చోట నిర్వహించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో అగ్ర కులానికి చెందిన రైతు శివాజీ (శివాజీ) హఠాత్తుగా మరణిస్తాడు. అయితే కొన్ని కారణాల వల్ల ఆయన శవాన్ని అగ్రకుల స్మశాన వాటికలో దహనం చేయడానికి వీల్లేదని ఆ కుల పెద్దలు అడ్డుతగులుతారు. దీంతో తన తండ్రికి గౌరవప్రదమైన అంత్యక్రియలు నిర్వహించాలని కొడుకు విష్ణు (నందు), కూతురు సుజాత (మనికా చిక్కాల), ఊరి సర్పంచ్ (నవదీప్) కలిసి పోరాటం మొదలుపెడతారు. అయితే సొంత కులమే శివాజీని ఎందుకు వెలివేసింది? తక్కువ కులానికి చెందిన రవి (రవికృష్ణ) హత్యకు, ఈ కుల రాజకీయాలకు సంబంధం ఏంటి? వేశ్య శ్రీలత (బిందుమాధవి) పాత్ర శివాజీ జీవితాన్ని ఎలా మార్చింది? చివరికి శివాజీ అంత్యక్రియలు సజావుగా సాగాయా లేదా? అనేదే మిగతా కథ.




# 'బాహుబలి 2' రికార్డు బద్దలు.. నార్త్ అమెరికాలో 'ధురంధర్' సరికొత్త చరిత్ర!

బాలీవుడ్ సినిమా ధురంధర్ విడుదలై నెల దాటుతున్న ఇంకా హౌస్‌ఫుల్ కలెక్షన్స్‌తో దూసుకుపోతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే రూ.1300 కోట్ల వసూళ్లను రాబట్టిన ఈ చిత్రం తాజాగా మరో రికార్డును అందుకుంది. గత 9 ఏండ్లుగా చెక్కుచెదరకుండా ఉన్న ఎస్.ఎస్. రాజమౌళి 'బాహుబలి 2' రికార్డును ధురంధర్ తాజాగా అధిగమించింది. నార్త్ అమెరికాలో ఇప్పటివరకు అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ సినిమాగా 20.7 మిలియన్ డాలర్లతో 'బాహుబలి 2' అగ్రస్థానంలో ఉండగా.. ఇప్పుడు 'ధురంధర్' 21 మిలియన్ డాలర్ల మార్కును దాటి అగ్రపీఠాన్ని కైవసం చేసుకుంది. ఈ క్రమంలో కల్కి 2898 ఏడీ (18.5మీ), పఠాన్ (17.5మీ), జవాన్ (15.6మీ) వంటి భారీ చిత్రాలను ఇది వెనక్కి నెట్టింది. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సినిమాల సందడి నెలకొన్నప్పటికీ, ఉత్తరాదిలో ఈ సినిమా ప్రభంజనం ఏమాత్రం తగ్గలేదు. ఇండియన్ బాక్సాఫీస్ వద్ద ఈ చిత్రం ఇప్పటివరకు రూ. 863 కోట్ల నెట్ వసూళ్లు రాబట్టినట్లు ట్రేడ్ విశ్లేషకులు చెబుతున్నారు. గత ఐదు రోజుల్లోనే దాదాపు రూ. 22 కోట్లకు పైగా వసూళ్లు రావడం ఈ సినిమా సత్తాను చాటుతోంది. సంజయ్ దత్, అక్షయ్ ఖన్నా, ఆర్. మాధవన్ వంటి హేమాహేమీలు నటించిన ఈ చిత్రం అటు ఆస్ట్రేలియా మార్కెట్‌లోనూ సత్తా చాటుతోంది. వచ్చే వారం 'బోర్డర్ 2' విడుదలయ్యే వరకు ఈ జోరు ఇలాగే కొనసాగే అవకాశం కనిపిస్తోంది.



# బాలీవుడ్ పీఆర్ కల్చర్‌పై తాప్సీ ఆసక్తికర వ్యాఖ్యలు

"హిందీ చిత్ర పరిశ్రమలో ప్రతి దానికీ డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి వచ్చింది. గత రెండేళ్లలో బాలీవుడ్‌లో పీఆర్ (పబ్లిక్ రిలేషన్స్) వ్యూహాలు పూర్తిగా మారిపోయాయి. ఒకప్పుడు పీఆర్ అంటే మన గురించి, మన సినిమాల గురించి మంచి మాటలు ప్రచారం చేయడం. ఇప్పుడు ప్రమోషన్ అనేది ఇతరులను తక్కువగా చూపించే స్థాయికి వెళ్లింది. ఇతరులను కిందికి లాగడానికి కూడా డబ్బులు ఖర్చు చేస్తున్నారు. మన ప్రతిభను కూడా డబ్బుతోనే ముడిపెడుతున్నారు" అని హీరోయిన్ తాప్సీ పేర్కొన్నారు. ఏ విషయం గురించి అయినా నిర్మొహమాటంగా మాట్లాడే తాప్సీ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పీఆర్ వ్యవస్థ గురించి మాట్లాడారు. "నేను నా పనులతో చాలా బిజీగా ఉన్నాను. రెండేళ్లుగా వర్క్‌లో స్పీడ్ తగ్గించాను. ఏడాదిన్నర నుంచి ఇండస్ట్రీలోని పీఆర్ వ్యవస్థలో చాలా మార్పులు వచ్చాయి. ఇక్కడ ప్రతి దానికి డబ్బు చెల్లించాలని గ్రహించాను. ప్రతిభను కూడా డబ్బుతోనే ముడిపెడతారు. మీ విజయం వేరొకరి వైఫల్యంపై ఆధారపడి ఉంటుందనేలా కొత్త వెర్షన్స్ సృష్టించారు. కానీ, నా మనస్తత్వం పూర్తి భిన్నమైనది. మన పనే మన గురించి చెప్పాలనుకుంటాను. అందుకే ఇలాంటి వాటి కోసం డబ్బులు ఖర్చు చేయను. నా ప్రయాణాలు, నా కోసం, నా కుటుంబంపై, నాకు దగ్గరైన వాళ్లపై ఖర్చు చేయడానికే ఇష్టపడతాను. నన్ను ప్రశంసిస్తూ ఆర్టికల్స్ రాయడానికి, నన్ను పొగడడం కోసం మాత్రమే సోషల్ మీడియా ఖాతాలకు వేలల్లో చెల్లించడానికి నా దగ్గర అంత డబ్బు లేదు" అని స్పష్టం

## బిజినెస్

### 44.89 లక్షల పీవీల టోకు విక్రయాలు



వాహన కంపెనీల నుంచి డీలర్లకు ప్రయాణికుల వాహ న (పీవీ–కార్లు, జీపులు, వ్యాన్లు) సరఫరాలు 2025 లో 44,89, 717కు చేరా యని తయారీదార్ల సమాఖ్య సియామ్ మంగళవారం వెల్లడించింది. 2024లో సరఫరా అయిన 42,74, 793 వాహనాల కంటే ఇవి 5% ఎక్కువ. జీఎస్టీ రేట్లు తగ్గడం, పండగ సీజన్‌లో బలమైన అమ్మకాల వల్ల, ఒక క్యాలెండర్ ఏడాదిలో 2025 రికార్డు సృష్టించిందని పేర్కొంది. 'భారతీయ వాహన పరిశ్రమకు గత ఏడాది మైలురాయిగా నిలిచింది. తొలి అర్ధ భాగంలో స్తబ్ధుగా కనిపించిన పరిశ్రమ, సరఫరా సవాళ్లను ఎదుర్కొంది. ఆదాయపు పన్ను ఉపశమనం, రెపో రేటు కోతలు, జీఎస్టీ 2.0 వంటి బహుళ నిర్మాణాత్మక సంస్కరణలతో .. వాహనాలకు సానుకూల గిరాకీ వాతావరణం ఏర్పడింద'ని సియామ్ ప్రెసిడెంట్ శైలేష్ చంద్ర వెల్లడించారు. స్థిరమైన స్థూల ఆర్థిక పరిస్థితులు, అందుబాటు ధరలు, విధాన మద్దతుతో 2026లో కూడా పరిశ్రమ సానుకూల ధోరణిలో పయనించే అవకాశం ఉందని అంచనా వేశారు.

### వినియోగదారులకు క్షమాపణలు తెలిపిన నెస్లె సిఇఒ



30కి పైగా దేశాలు కొన్ని బ్యాచ్‌ల శిశు పోషకాహార ఉత్పత్తులను వెనక్కిపంపడంపై నెస్లె సిఇఒ పిలిప్ నవ్రాటిల్ వినియోగదారులకు క్షమాపణలు తెలిపారు. పరిస్థితిని వివరించే ముందు, తల్లిదండ్రులు, శిశు సంరక్షకులు మరియు వినియోగదారులకు కలిగించిన ఆందోళన, అంతరాయానికి క్షమాపణలు కోరుతున్నాను అని కంపెనీ వీడియోలో నవ్రాటిల్ పేర్కొన్నారు. వెనక్కి పంపిన ఉత్పత్తులను ఇప్పుడు ప్రకటించనున్నట్లు తెలిపారు. వాంతులు, వికారానికి కారణమయ్యే విషపూరిత రసాయనాలు ఉన్నందున శిశు ఉత్పత్తులను పలు యూరోపియన్ యూనియన్ దేశాలు, ఆస్ట్రేలియా,బ్రెజిల్, చైనా, మెక్సికో మరియు దక్షిణాఫ్రికా సహా సుమారు 37 దేశాలు తిరస్కరించిన సంగతి తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా వెనక్కి పంపిన ఉత్తత్తులను భారతదేశంలో దిగుమతి చేసుకోవడం లేదా విక్రయించడం లేదని నెస్లె స్పష్టం చేసింది. ప్రతి ఉత్పత్తిని స్థానికంగా తయారు చేస్తామని పేర్కొంది

### రష్యా ఇంధన దిగుమతుల్లో మూడో స్థానానికి భారత్

రష్యా నుంచి శిలాజ ఇంధనాల కొనుగోలుదార్లలో భారత్ మూడో స్థానానికి పరిమితమైంది. రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో పాటు ప్రభుత్వ చమురు రిఫైనరీలు, రష్యా నుంచి దిగుమతులు తగ్గించడం ఇందుకు నేపథ్యమని మేధో సంస్థ సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్(సీఆర్ఈఏ) పేర్కొంది. డిసెంబరులో భారత్ మొత్తం మీద 2.3 బిలియన్ యూరోల (సుమారు రూ.24,150 కోట్లు) విలువైన ముడిచమురు ఉత్పత్తులను దిగుమతి చేసుకుంది. నవంబరు దిగుమతులు 3.3 బి. యూరోలు కావడం గమనార్హం. 2.6 బి. యూరోల విలువైన రష్యా ముడిచమురు కొనుగోళ్లతో, తుర్కియే రెండో స్థానాన్ని భర్తీ చేసింది. రష్యా చమురు కొనుగోలులో చైనా అగ్రగామిగా కొనసాగుతోంది. రష్యా అగ్రగామి 5 సంస్థలకు వచ్చిన ఎగుమతి ఆదాయాల్లో, చైనా వాటా 48% (6 బిలియన్ యూరోలు) కావడం గమనార్హం. రష్యా నుంచి భారత్ కొనుగోళ్లలో చమురు వాటా 78 శాతంగా ఉంటోంది. దీని విలువ 1.8 బి. యూరోలు(దాదాపు రూ.18,900 కోట్లు). తర్వాతి స్థానాల్లో బొగ్గు(424 మి. యూరోలు), చమురు ఉత్పత్తులు (82 మి. యూరోలు) ఉన్నాయి.

# రూ. 4 లక్షల కోట్లకు దేశ ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు

2025లో మనదేశ ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు రూ.4 లక్షల కోట్ల మార్కును దాటాయని కేంద్ర ఎలక్ట్రానిక్స్ మరియు ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ మంగళవారం తెలిపారు. ఈ ఏడాది నాలుగు సెమీకండక్టర్ తయారీ ప్లాంట్లు ఉత్పత్తిని ప్రారంభించడం ద్వారా ఇవి మరింత పెరుగుతాయని అభిప్రాయపడ్డారు. దీనికి సంబంధించి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో దీని గురించి పోస్ట్ చేసిన మంత్రి, ఎగుమతులు పెరగడంతో పెద్ద ఎత్తున ఉద్యోగాలను సృష్టి జరిగిందని, విదేశీ మారక ద్రవ్య ఆదాయాన్ని పెంచిందని అన్నారు. 2025లో ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు రూ.4 లక్షల కోట్లు దాటాయి. ఉద్యోగాలను, విదేశీ మారక ద్రవ్యాన్ని తీసుకువచ్చాయి. నాలుగు సెమీకండక్టర్ ప్లాంట్లు వాణిజ్య ఉత్పత్తిలోకి రావడంతో 2026లో కూడా ఇదే ఊపు కొనసాగుతుందని వెల్లడించారు. అధికారిక అంచనాల ప్రకారం, 2024–25లో దాదాపు రూ.11.3 లక్షల కోట్ల విలువైన ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి జరిగింది. ఇందులో ఎగుమతుల విలువ దాదాపు రూ.3.3 లక్షల కోట్లుగా ఉంది. ఈ రంగం ప్రస్తుతం 25 లక్షల మందికి పైగా ఉపాధి కల్పిస్తోంది. దేశంలో ఎలక్ట్రానిక్స్ తయారీలో ఎక్కువ భాగం మొబైల్ ఫోన్లే ఉన్నాయని పరిశ్రమ వర్గాలు పేరొన్నాయి. గతేడాది మన్దేశం నుంచి ఐఫోన్ ఎగుమతులు రూ. 2.03 లక్షల కోట్లకు చేరుకున్నాయని, ఇది అంతకుముందు 2024లో నమోదైన



రూ. 1.1 లక్షల కోట్ల కంటే దాదాపు రెట్టింపు అని మంత్రి పోస్ట్‌లో పేర్కొన్నారు. భారత సెల్యులార్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి దేశంలో మొబైల్ ఫోన్ ఉత్పత్తి 75 బిలియన్ డాలర్ల(రూ. 6.77 లక్షల కోట్ల)కు చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్లు తన నివేదికలో ప్రస్తావించింది. వీటిలో 30 బిలియన్ డాలర్ల(రూ. 2.70 లక్షల కోట్ల) ఎగుమతులు ఉన్నాయి.

## భారత జీడీపీ వృద్ధి అంచనాలను అప్‌గ్రేడ్ చేసిన ప్రపంచ బ్యాంకు

వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి భారత వృద్ధి అంచనాలను అప్‌గ్రేడ్ చేస్తున్నట్టు ప్రపంచ బ్యాంకు వెల్లడించింది. గతేడాది అక్టోబర్‌లో అంచనా వేసిన 6.3 శాతంగా అంచనా వేసింది. ప్రస్తుతం దీన్ని 6.5 శాతానికి సవరిస్తున్నట్టు ప్రపంచ బ్యాంకు మంగళవారం ప్రకటనలో తెలిపింది. ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థికవ్యవస్థలలో భారత్ అత్యంత వేగవంతమైన వృద్ధి రేటును కొనసాగిస్తుంది. అమెరికాకు పంపే కొన్ని ఎగుమతులపై అధిక సుంకాలు ఉన్నప్పటికీ, ఇది భారత వస్తువుల ఎగుమతుల్లో దాదాపు 12 శాతం వాటాయే ఉంది. ప్రధానంగా దేశీయ డిమాండ్‌లో బలమైన ఊపు, గతంలో ఊహించిన దానికంటే అధిక స్థిరమైన ఎగుమతుల ద్వారా ప్రతికూల ప్రభావాలను భారత్ అధిగమిస్తుందని ప్రపంచ బ్యాంకు తన తాజా గ్లోబల్ ఎకనామిక్ ప్రాస్పెక్ట్స్ నివేదికలో పేర్కొంది. ఇదే సమయంలో ప్రపంచ వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గితే భారత వృద్ధి అంచనా మరింత మెరుగుపడుతుందని ప్రపంచ బ్యాంకు చెబుతోంది. కొన్ని వాణిజ్య సమస్యలకు పరిష్కారం లభించడం, అమెరికా సుంకాలను పాక్షికంగా ఉపసంహరించుకుంటే, భారత ఎగుమతులు ఊహించిన




దానికంటే వేగంగా పెరగవచ్చు. వాణిజ్య అడ్డంకులను తగ్గించడానికి దేశాల మధ్య చర్చలు మరింత విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంలో కూడా సహాయపడతాయి. తద్వారా వ్యాపార, వినియోగదారుల విశ్వాసం పెరుగుతుంది, దీనివల్ల ఆర్థిక వ్యవస్థలో అధిక వ్యయం, అధిక పెట్టుబడులకు ఆస్కారం ఉంటుందని ప్రపంచ బ్యాంకు వెల్లడించింది.

# కేఎల్ రాహుల్ సెంచరీ..

రాజ్‌కోట్ వేదికగా న్యూజిలాండ్‌తో జరగుతున్న రెండో వన్డేలో టీమిండియా స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ అద్భుతమైన సెంచరీతో చెలరేగాడు. 120 పరుగులకే నాలుగు కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన జట్టును రాహుల్ తన సెంచరీతో ఆదుకున్నాడు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఓపెనర్లు రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ శుభారంభం ఇచ్చారు. తొలి వికెట్‌కు వీరిద్దరూ 70 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. రోహిత్(24) ఔటయ్యాక గిల్(56), శ్రేయస్ అయ్యర్(8), విరాట్ కోహ్లి(23) వెంటవెంటనే పెవిలియన్‌కు చేరారు. ఈ క్రమంలో రాహుల్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా(27)తో కలిసి ఇన్నింగ్స్ చక్కదిద్దాడు. జడేజా ఔటైనప్పటికి రాహుల్ మాత్రం తన ఏకాగ్రతను కోల్పోలేదు. ఆచితూచి ఆడుతూ 87 బంతుల్లో తన ఎనిమిదివ వన్డే సెంచరీ మార్క్‌ను కేఎల్ అందుకున్నాడు. ఫలితంగా భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 284 పరుగులు చేసింది. మొత్తంగా రాహుల్ 92 బంతులు ఎదుర్కొని 11 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 112 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. న్యూజిలాండ్ బౌలర్లలో క్రిస్టేన్ క్లార్క్ మూడు వికెట్లు పడగొట్టగా.. జేమీసన్, పౌల్క్‌చ, బ్రెస్‌వెల్ తలా వికెట్ సాధించారు.




# పాకిస్థాన్‌తో మూడు టీ20 మ్యాచ్‌లు ఆడనున్న ఆస్ట్రేలియా

**లాహోర్:** వచ్చే నెలలో ఐసీసీ టీ20 వరల్డ్‌కప్ జరగనున్న విషయం తెలిసిందే. అయితే ఆ టోర్నీ భారత్, శ్రీలంక వేదికగా జరనున్నది. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా జట్టు పాకిస్థాన్(గ్రూాఖజూాఖూ)లో పర్యటించనున్నది. వరల్డ్‌కప్ ప్రిపరేషన్‌లో భాగంగా పాకిస్థాన్‌తో మూడు టీ20 మ్యాచ్‌లను ఆస్ట్రేలియా ఆడనున్నది. లాహోర్‌లోని గడాఫీ స్టేడియంలో జనవరి 29, 31, ఫిబ్రవరి ఒకటో తేదీన ఆ మ్యాచ్‌లను నిర్వహించనున్నారు. అయితే ఆస్ట్రేలియా తన వరల్డ్‌కప్ మ్యాచ్‌లను ఇండియాలో ఆడనున్నది. ఇక పాకిస్థాన్ తన మ్యాచ్‌లన్నీ శ్రీలంక వేదికగా ఆడనున్నది. ఏప్రిల్ 2022లో చివరిసారి ఆస్ట్రేలియా జట్టు పాకిస్థాన్‌లో పర్యటించింది. జనవరి 28వ తేదీన ఆస్ట్రేలియా జట్టు పాకిస్థాన్‌కు చేరుకోనున్నది. గత ఏడాది చాంపియన్స్ ట్రోఫీలో కొన్ని మ్యాచ్‌లను పాకిస్థాన్ వేదికగా ఆస్ట్రేలియా ఆడింది. ఆసీస్‌తో జరిగే సిరీస్‌కు చెందిన జట్టును పాకిస్థాన్ త్వరలో ప్రకటించనున్నది. పాక్ కోచ్ మైక్ హెస్సాన్, కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘా ఈ అంశంపై భేటీకానున్నారు.



## స్పోర్ట్స్

### ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్.. టాప్ ప్లేస్‌లో కోహ్లి



**దుబాయ్:** ఇండియన్ స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి(ఎఱతీఫ్ ఖశీష్త్రశ్రీఱ).. వన్డే ర్యాంకింగ్స్‌లో టాప్ ప్లేస్ కొట్టేశాడు. న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో హాఫ్ సెంచరీ చేసిన కోహ్లి తన ర్యాంక్‌ను మెరుగుపరుచుకున్నాడు. 37 ఏళ్ల కోహ్లి .. 2021 జూలై తర్వాత మళ్లీ వన్డే ర్యాంకింగ్స్‌లో తొలి స్థానాన్ని ఆక్రమించుకున్నాడు. మాజీ కెప్టెన్ రోహిత్ వర్మ వన్డే బ్యాటింగ్‌లో మూడవ స్థానానికి పడిపోయాడు. కోహ్లి ఫస్ట్ వన్డేలో కివీస్‌పై 93 రన్స్ స్కోరు చేశాడు. దీంతో అతను వన్డేల్లో అత్యధిక రన్స్ చేసిన రెండో బ్యాటర్‌గా నిలిచాడు. ఫస్ట్ లో సచిన్ టెండూల్కర్ ఉన్నాడు. కోహ్లి తన చివరి అయిదు ఇన్నింగ్స్‌లో అద్భుతమైన బ్యాటింగ్‌ను ప్రదర్శించాడు. ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో 74, 135, 102 స్కోర్ చేశాడు. ఇక సఫారీలతో ఓ మ్యాచ్‌లో 65, కివీస్‌తో ఫస్ట్ మ్యాచ్‌లో 93 స్కోరు చేశాడు. అక్టోబర్ 2013లో కోహ్లి తొలిసారి వన్డే ర్యాంకింగ్స్‌లో నెంబర్ వన్ స్థానంలో నిలిచాడు. ఇక ఆ పొజిషన్‌లో మొత్తం 11 సార్లు అతను టాప్ ప్లేస్‌లో నిలిచాడు. కోహ్లి తన కెరీర్‌లో 825 రోజుల పాటు వన్డే టాప్ బ్యాటర్‌గా నిలిచాడు. శుభమన్ గిల్ అయిదవ స్థానంలో, శ్రేయాస్ అయ్యర్ టాప్ 10లో ఉన్నాడు.

AKSHARA SAAVAL PRINTED PUBLISHED EDITED AND OWNED BY BADAVATH BALAJI PRINTED AT H.NO.-1-9-1296/5/B/A/1, NEW SHAYAMPET, KAZIPET MANDAL, HANUMAKONDA, TELANGANA-506001,EDITOR B.BALAJI CELL:8096677136 H.NO.-45/12/151, INDIRA NAGAR, MANDAL GEESUGONDA, WARANGAL TELANGANA-506013_ **RNI :**TEL TEL / 2023/ 84132